ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

ప్లాట్ కొంటే పాట్లే!

శ్రీకాళహస్తిలో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు ● మోసపోతున్న జనం

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని నిబంధనలు విధించినప్పటికీ అధికారుల అలసత్వంతో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తూనే ఉన్నాయి. అక్కడ ప్లాట్లు కొనే ప్రజలకు పాట్లు తప్పడం లేదు. ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి పట్టణం శరవేగంగా విస్తరిస్తోంది. పరిసరాల్లో భారీ పరిశ్రమలు, కేంద్ర విద్యాసంస్థలు, జాతీయ రహదారి, సమీపంలో సెజ్‌లు ఉండటంతో ఇక్కడ నివాస స్థలాలకు డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఇదే అదనుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడ గద్దల్లా వాలిపోయారు. రాత్రికి రాత్రే వ్యవసాయ భూములను చదును చేసి, అనధికారికంగా లేఅవుట్లు గీసి ప్రజలకు విక్రయించి కోట్లు గడిస్తున్నారు.


తొట్టంబేడులో వేసిన లే అవుట్

భెల్ పరిశ్రమ ఏర్పాటుతో..

గతంలో మన్నవరం భెల్ పరిశ్రమ ఏర్పాటుపై అధికారిక ప్రకటన వెలువడటంతో నియోజకవర్గంలో పంట పొలాల్లో లేఅవుట్లు వేసి ఇష్టారాజ్యంగా అమ్మి సొమ్ము చేసుకున్నారు. అలాంటి ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు 15ఏళ్ల నుంచి ఎలాంటి అభివృద్ధీ లేక అత్యవసర పరిస్థితుల్లో తిరిగి విక్రయించుకోలేక ఇబ్బంది పడుతున్నారు.

వైసీపీ పాలనలో మూడు పువ్వులు..ఆరు కాయలుగా..

గత వైసీపీ పాలనలో రియల్ వ్యాపారుల అక్రమ లేఅవుట్ల దందా మూడు పువ్వులు, ఆరుకాయలుగా సాగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిబంధనల ప్రకారం లేఅవుట్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందన్న అనుమానంతో కొన్ని నెలల పాటు ఎక్కడా లావాదేవీలు జరపలేదు. ప్రస్తుతం మళ్లీ తమ కార్యకలాపాలకు పదును పెట్టారు. ఏదైనా వ్యవసాయ భూమిని ఐదుశాతం మార్కెట్ ధర ప్రకారం ప్రభుత్వానికి చలానా చెల్లించి ఆర్డీవో ద్వారా ల్యాండ్ కన్వర్షన్ ప్రొసీడింగ్స్ పొందాలి. ఆ తర్వాత అప్రూవల్ చేసుకోవాలి. అయితే కనీసం కన్వర్షన్‌గా కూడా చేయకుండా వందలాది లేఅవుట్లు శ్రీకాళహస్తి చుట్టుపక్కల వేశారు. అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు ఇల్లు కట్టుకునే సమయంలో ఇరుకు రోడ్లు, కన్వర్షన్ అప్రూవల్ రాక ముప్పుతిప్పలు పడుతున్నారు. కన్వర్షన్ కూడా లేకపోవడంతో కొంతకాలానికి ప్రైవేటు వ్యక్తులు వచ్చి ఈ భూమి తమదంటూ గొడవకు దిగుతున్న ఘటనలు చాలా ఉన్నాయి.

ప్రభుత్వం మారినా అదేతీరు

కూటమి ప్రభుత్వంలోనూ అక్రమ లేఅవుట్లు కోరలు చాస్తున్నాయి. ఇటీవల శ్రీకాళహస్తి - తిరుపతి ప్రధాన రహదారికి ఆనుకుని పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద రెండు లేఅవుట్లు వెలిశాయి. ఇటువైపున నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. అయినా ఎవరూ పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

70 అక్రమ లేఅవుట్లు...

తొట్టంబేడు గ్రామం శ్రీకాళహస్తి పట్టణంలో భాగంగా అభివృద్ధి చెందింది. తొట్టంబేడు రెవెన్యూ పరిధిలో ఇప్పటికే 70కి పైగా కన్వర్షన్ కానీ అక్రమ లేఅవుట్లు ఉన్నాయి. తాజాగా తొట్టంబేడు గ్రామానికి అనుకుని తూర్పు వైపున రెండు రోజుల నుంచి రాత్రివేళలో రెండు ఎకరాల్లో భూమిని చదును చేసి గ్రావెల్ తోలి అక్రమ లే అవుట్ ఏర్పాటు చేశారు. తొట్టంబేడు దళితవాడలోని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిమెంటు రోడ్డును వెంచర్‌కు ప్రధాన మార్గంగా చూపుతూ లేఅవుట్‌ను రూపొందించారు. శ్రీకాళహస్తి రెవెన్యూ అధికారులు ఇకనైనా అక్రమ లేఅవుట్లపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చెవిరెడ్డీ.. నీ నటనను నమ్మరెవరు?



కోర్టు బయట అధికారులను బెదిరిస్తావ్. జడ్జిల ముందు ఏడుస్తావ్. మద్యం కుంభకోణంలో సంబంధం లేదంటూ రోజుకో అబద్ధాన్ని చెప్పావ్. ఇలా నీ నటనతో ప్రజలను నమ్మించాలని ప్రయత్నించావ్. కానీ, బయటపడుతున్న సాక్ష్యాధారాలతో నీ నటనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. లిక్కర్ స్కామ్‌లో జగన్‌కంటే నీ పాత్రే కీలకం. మద్యం సొమ్మును విదేశాలకు తరలించడంలోనూ చెవిరెడ్డి ముఠా కీలక పాత్ర పోషించింది. తుడాలోనూ పాల్పడ్డ అవినీతికి తండ్రీ కొడుకులు (చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి) శిక్ష అనుభవిస్తారు. అక్రమ సంపాదనతో తుమ్మలగుంటలో నిర్మించిన దేవాలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసకోవాలి.

- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ, తిరుపతి రూరల్ టీడీపీ కార్యాలయంలో

దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది భూమనా..



"భూమన కరుణాకరరెడ్డి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంటుంది. దేశసరిహద్దుల్లో ఉగ్రదాడుల నేపథ్యంలో తిరుమల భద్రతకు టీటీడీ ప్రాధాన్యం ఇచ్చింది. మఠాలకు వచ్చే భక్తుల ఆధార్‌కార్డు, వివరాలు నమోదు చేయాలనీ, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలనీ సూచిస్తే.. దీనిని హిందూమతంపై, మఠాలపై దాడి అంటారా? అబద్ధాలు ప్రచారం చేయడమే మీరు పనిగా పెట్టుకున్నారు భూమనా! తిరుమలను ధనార్జన క్షేత్రంగా, రాజకీయ పునరావసకేంద్రంగా మార్చిన మీరు.. పరకామణి దొంగను సేఫ్ ఎగ్జిట్ చేసిన మీరా ఈరోజు నీతులు చెప్పేది?"

- టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి తిరుమలలో

స్మార్ట్ మీటర్లతో ఉపయోగమే

వినియోగదారులపై భారం పడదు ● సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు



తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థలో ఆధునిక సాంకేతిక వ్యవస్థ అందుబాటులోని వస్తున్న సమయంలో వినియోగదారులకు, సంస్థకు ఉపయోగకరంగా ఉండేందుకు, అన్ని కేటగిరిల్లో (వ్యవసాయ రంగం తప్ప) స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నట్లు సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు సోమవారం వెల్లడించారు. గతంలో విద్యుత్ సంస్థలో చక్రం తిరుగుతూ రీడింగ్ చూపించే మెకానిక్ మీటరు ఉండేదన్నారు. సాంకేతికత పెరిగేకొద్దీ వాటి స్థానంలో డిజిటల్ మీటర్లు వచ్చాయన్నారు. డిజిటల్ మీటరు, స్మార్ట్ మీటరుతో సమానమేనని ఆయన చెప్పారు. ఈ స్మార్ట్ మీటరుతో విద్యుత్ వినియోగాన్ని ప్రతి రోజు, ప్రతి గంటా పరిశీలించుకోవచ్చన్నారు. వినియోగం ఎక్కువ అవుతుందని తెలిస్తే, పొదుపుగా వాడుకొనే అవకాశం ఉందన్నారు. వినియోగదారులపై పెరిగే భారాన్ని, వారే నియంత్రించుకోవచ్చన్నారు. వినియోగదారులు ఎక్కడున్నా ఆన్‌లైన్‌లో మీటర్ రీడింగ్ పరిశీలించుకోవచ్చని సూచించారు. ఇది కచ్చితమైన మీటర్ రీడింగ్ చూపిస్తుందని చెప్పారు. విద్యుత్ లోడ్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవచ్చన్నారు. మీటర్ రీడింగ్ నిర్ణయించిన తేదీలో తీసే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి రీడింగ్ తీసే అవసరం వుండదన్నారు. స్మార్ట్ మీటర్లు అమర్చే విషయంలో వినియోగదారులు అపోహలు వీడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ పునర్ వ్యవస్థీకరణ పథకం(ఆర్డీఎస్ఎస్)లో భాగంగా ఈ మీటర్లు అమర్చుతున్నారని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్‌సీ) 2021 ఫిబ్రవరిలో ఈ మీటర్లు అమర్చడానికి అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు సదరన్ డిస్కం సంస్థ పరిధిలోని 1,52,016 ప్రభుత్వ రంగ సంస్థలకు, 53,64,841 వాణిజ్య సర్వీసులకు, 43009 పరిశ్రమలకు మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గృహ విద్యుత్ సర్వీసుల్లో 200 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ వినియోగిస్తున్న సర్వీసులను గుర్తించి దశల వారీగా ఈ మీటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మీటరు విలువ రూ.ఆరు వేలు ఉండొచ్చని, వినియోగదారులకు ఉచితంగా అమర్చుతామని చెప్పారు. ఈ స్మార్టు మీటర్లు అమర్చాక వినియోగ బిల్లుల్లో మీటరు కోసం అదనపు చార్జీలు విధించేది లేదని ఆయన స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్లపై వినియోగదారులకు అవగాహనా కార్యక్రమాలు చేపడతామన్నారు. వీటిపై వినియోగదారులకు అనుమానాలుంటే టోల్ ఫ్రీ నెంబరు 1912 కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు.



రాంగ్ రూట్‌లో వచ్చిన బైక్

● పనపాకం వద్ద లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకుల దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హరీష్‌నాయుడు, పరంధామ

చంద్రగిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం పనపాకం వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం రాత్రి రాంగ్ రూట్‌లో వస్తున్న బైక్‌ను లారీ ఢీకొనడంతో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం తంబుగనిపల్లెకు చెందిన గడ్డం హరీష్‌నాయుడు(27), పరంధామ(33) బైక్‌పై చిత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్నారు. తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళుతున్న లారీ పనపాకం వద్ద రాంగ్ రూట్‌లో వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో గడ్డం హరీష్‌నాయుడు, పరంధామ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పరంధామకు ఏడాది కిందటే వివాహమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

8, 9 తేదీల్లో తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా ఈనెల 8, 9 తేదీల్లో తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని తిరుపతి సెంట్రల్ బస్సుస్టేషన్ ఏటీఎం భాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 4గంటల నుంచి 9న ఉదయం 11గంటల వరకు ప్రతి 15నిమిషాలకు ఓ బస్సు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. తిరుగు ప్రయాణంలోనూ 9వ తేది సాయంత్రం 5గంటల వరకు బస్సు సౌకర్యం కలదన్నారు.


బస్సులో ఇరుక్కుపోయిన ఖాదర్ మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు, హైవే సిబ్బంది

లారీని ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

● క్లీనర్ మృతి, మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
● 10 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులంతా గాఢనిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా పెద్ద శబ్ధం. లేచి చూసేసరికి క్లీనర్ మృతి చెంది ఉండగా, మరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రక్తం కారుతున్న కొందరు ప్రయాణికులు ఒకరినొకరు చూసుకొని కేకలు వేశారు. ఈ ఘటన నాయుడుపేట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం అర్ధరాత్రి ఒంగోలు నుంచి బెంగళూరుకు ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు నాయుడుపేట - చెన్నై జాతీయ రహదారి సమీపంలోకి రాగానే బొగ్గు లోడుతో ముందు వెళ్తున్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ ఖాదర్(45) క్యాబిన్‌లో ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. మరో డ్రైవర్ సురేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బస్సు నడుపుతున్న గౌస్‌బాషా, 10 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, హైవే మొబైల్, 108సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకొని బస్సులో ఇరుక్కుపోయిన ఖాదర్ మృతదేహాన్ని అతి కష్టంమీద బయటకు తీసి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలు రోడ్డుపైనే ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు క్రేన్ సహాయంతో రెండు వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


- గాయపడిన డ్రైవర్ సురేష్‌రెడ్డి

పోలీసు జాగిలం మృతి


పోలీసు జాగిలం పృథ్వీ

తిరుపతి (నేరవిభాగం) ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నో బంగారు పతకాలు సాధించింది. వీఐపీల భద్రతలో సమర్థంగా వ్యవహరించింది. పోలీసు శాఖకు విశిష్ట సేవలు అందించింది. అలాంటి పోలీసు జాగిలం పృథ్వీ.. వయోభారంతో సోమవారం మృతి చెందింది. ఎనిమిది సంవత్సరాల పాటు పోలీసు శాఖకు సేవలు అందించి 2023లో పదవీ విరమణ పొందింది. రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు జిల్లా డాగ్ కెనాల్ వద్ద పృథ్వీ కళేబరంపై పుష్పగుచ్ఛం ఉంచి గౌరవ వందనం సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు శాఖకు జాగిలం అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజర్వు డీఎస్పీలు, సీఐలు, సీవీఎస్‌వో మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. లాబ్రడార్ రిట్రైవర్ జాతికి చెందిన పృథ్వీ హ్యాండ్లర్ మోహన్ నేతృత్వంలో పలువురు వీవీఐపీల బందోబస్తు సందర్భంగాను.. తిరుమల బ్రహ్మోత్సవాల సమయాల్లోనూ భద్రతా తనిఖీల్లో పాల్గొంది. బేసిక్ శిక్షణలో 2014లో గోల్డు మెడల్ సాధించింది. లక్నోలో జరిగిన ఆల్ ఇండియా ఇండియా డ్యూటీ మీట్‌లో 2019లో పాల్గొనింది. 2020లో జరిగిన ఏపీ పోలీసు డ్యూటీ మీట్‌లో గోల్డు మెడల్ సాధించింది.


జాగిలానికి నివాళులు అర్పిస్తున్న అదనపు ఎస్పీ

డీసీసీబీకి రెండు విశిష్ట అవార్డులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ (ఆప్కాబ్) 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం విజయవాడలోని గవర్నర్‌పేట ఎం.బి. విజ్ఞానకేంద్రంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్‌శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హాజరుకాగా, ఆప్కాబ్ చైర్మన్ గన్నె వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాయలసీమలోని సహకార బ్యాంకుల పరిధిలో డిపాజిట్లు, రుణపంపిణీ, వసూళ్ళు, నిర్ణీత గడువుకంటే ముందుగానే సింగిల్ విండోల కంప్యూటరీకరణ వంటి అంశాలను ప్రాతిపదికన తీసుకుని 'ఓవరాల్ పర్ఫార్మెన్స్' కింద 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల్లో ఉత్తమ పనితీరు కనబరచిన చిత్తూరు జిల్లా సహకార బ్యాంకును అవార్డుకు ఆప్కాబ్ ఎంపిక చేసింది.మంత్రి అచ్చెన్నాయుడు చేతులమీదుగా చిత్తూరు డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి, ఆప్కాబ్ చైర్మన్ గన్నె వీరాంజనేయులు చేతులమీదుగా బ్యాంకు సీఈవో సి. శంకర్‌బాబు సర్టిఫికెట్, మెమెంటోతో పాటు రూ.3లక్షల నగదు బహుమతిని అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి కోసలనగరం, వాయల్పాడు, ఏర్పేడు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రేణిగుంట, మదనపల్లె, గంగాధరనెల్లూరు సింగిల్ విండోలు అన్నిరంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆప్కాబ్ ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయా సింగిల్‌విండోల త్రిసభ్య కమిటీ చైర్మన్లు, సీఈవోలు కార్యక్రమానికి హాజరై మంత్రి నుండి సర్టిఫికెట్, మెమెంటో, రూ.20 వేల చొప్పున పారితోషికాన్ని అందుకున్నారు. ఆప్కాబ్ ఎండీ డాక్టర్ ఆర్. శ్రీనాథ్‌రెడ్డి, ప్రత్యేక ప్రభుత్వ కార్యదర్శి రాజశేఖర్, సహకారశాఖ రిజిస్ట్రార్ అహ్మద్ బాబు తదితరులు పాల్గొన్నారు.


డీసీసీబీ చైర్మన్‌కు అవార్డు బహూకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


మంత్రి నుంచి అవార్డును స్వీకరించిన ఆరు సింగిల్ విండోల చైర్మన్లు, సీఈవోలతో డీసీసీబీ సీఈవో సి. శంకర్ బాబు

ఐఐటీ,ఐసర్‌లను సందర్శించిన ఒడిశా గవర్నర్



ఐఐటీలో డీన్లు,అధ్యాపక బృందంతో సమావేశమైన డాక్టర్ హరిబాబు

ఏర్పేడు,ఆ గస్టు 4(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు వద్ద తిరుపతి ఐఐటీని ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు సోమవారం దర్శించారు. సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ అధ్వర్యంలో ఆయనకు అధ్యాపకులు స్వాగతం పలికారు. గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తరువాత డీన్స్ అధ్యాపకులు, విభాగాధిపతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ఎన్ఈపీ-2020 అమలు, పీవోఎస్‌సీహెచ్ కేసుల సమయాను కూల పరిష్కారం, పరిశ్రమలతో కలిసి నైపుణ్యాతాభివృద్ధి కోర్సులు లాంటి అంశాలపై మాట్లాడారు. అధ్యాపకులు ఏటా మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలన్నారు. అనంతరం డీఎస్టీ ఆధ్వర్యంలో ఐఐటీ టెక్నాలజీని పరిశీలించారు. ఒడిశా గవర్నర్ ఐసర్‌ను కూడా సందర్శించారు.సంస్థలో ఆధునిక మౌలిక సదుపాయాలను గురించి తెలుసుకుని అభినందించారు. త్రినేత్ర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. యాజమాన్యం, బోధన సిబ్బంది, విద్యార్థుల నిబద్ధతను కొనియాడారు. ఐసర్ డైరక్టర్ శాంతను బట్టాచార్య, రిజిస్ట్రార్ ఇంద్రపీత్‌సింగ్ కోహ్లీ, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండోను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



ప్రభాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు సింగిల్ విండోను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని నూతన అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్ పేర్కొన్నారు. సింగిల్ విండో అధ్యక్షుడిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ రైతులకు విరివిగా రుణాలు అందజేస్తామని, విత్తనాలు, ఎరువులు సొసైటీ ద్వారా విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తామని అన్నారు. బంగారు ఆభరణాలపైనా పంట రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని సహకారంతో సొసైటీని అభివృద్ధి చేస్తామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రభాకర్‌ను పూలమాలలు, శాలువలు, పూల బొకేలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, ఆర్వీ రమణారెడ్డి, మోహన్ రెడ్డి, మదనమోహన, మల్లికార్జున రెడ్డి, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, లోకనాథం, మునస్వామినాయుడు, బెల్లంకొండ రమణ, జేడీ బాలాజీ, కృష్ణమూర్తి, గురుమూర్తి, రమేష్ రెడ్డి, వెంకటరత్నం, విద్యాసాగర్ రెడ్డి, ముత్యాలు, మస్తాన్ సాహెబ్, హైదర్‌వలీ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న యానాదులు

భాకరాపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ శ్రీనివాస ఎస్టీ కాలనీలోని యానాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని చిన్నగొట్టిగల్లు తహసీల్దారు భాగ్యలక్ష్మికి 'విన్స్' సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా తాము గుడిసెలు వేసుకుని జీవిస్తున్నామని, పట్టాలుగానీ, పక్కా గృహాలుగానీ లేవని తెలిపారు. గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తాగునీటికి చాలా ఇబ్బందిగా ఉందని ఎంపీడీవోకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో 'విన్స్' సంస్థ కో-ఆర్డినేటర్ రహంతుల్లా, సూపర్‌వైజర్లు శకుంతలమ్మ, చంద్రిక పాల్గొన్నారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



పాకాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తూ కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పాకాల - ముంగిలిపట్టు రైల్వే మార్గంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ రత్నమాల వివరాల మేరకు.. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని రైల్వే సిబ్బంది గుర్తించారు. అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లభించలేదు. కుడిచేతిమీద దేవి అనే పేరు పచ్చబొట్టు ఉంది. అతని వద్ద నేండ్రగుంట పాకాల ఆర్టీసీ బస్సు టికెట్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'పీఎం రాష్ట్రీయ బాలపురస్కార్'కు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి (పీఎం) రాష్ట్రీయ బాలపురస్కార్ 2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారిణి వెంకటేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయస్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన 18 ఏళ్లలోపువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 15వ తేదీలోపు https\\awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు, రేపు స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజి మాలాదేవి మంగళ, బుధవారాల్లో జిల్లాలో పర్యటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జిల్లాలోని చౌకదుకాణాల్లో బియ్యం, చక్కెర పంపిణీ విధానం, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను తనిఖీ చేసి.. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



మృతుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించిన ఉగ్రాణం భాస్కరమ్మ, కుంట్రపాకం నిరంజన్‌కుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పులివర్తి నాని సోమవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, సర్పంచ్ రూపారామ్మూర్తి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నానిని కలిసిన తెలంగాణ ఎమ్మెల్యే

తిరుచానూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని సోమవారం తనపల్లి రోడ్డులోని రఘునాథ్ రిసార్ట్స్ టీడీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. నాని ఆయనను సన్మానించారు.

వెటర్నరీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా వినూ

తిరుపతిరూరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా గన్నవరం వెటర్నరీ కళాశాల యానిమల్ జెనిటిక్స్ అండ్ బ్రీడింగ్ (ఏజీబీ) విభాగ ప్రొఫెసర్ ఆర్.వినూను నియమిస్తూ సోమవారం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ ఉత్తర్వులు జారీ చేశారు. 6నెలలకాలం గానీ లేదా ఈలోపు రెగ్యులర్ నియామకం జరిగే వరకు గానీ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అబద్ధాలు చెప్పి అధికారంలోకి..: వైసీపీ



మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి అర్బన్/ చంద్రగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అబద్ధాలు చెప్పి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయని చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విమర్శించారు. నగర శివారు ప్రాంతం తిరుమలనగర్ పంచాయతీలోని హరితాకాలనీలో సోమవారం నిర్వహించిన బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో మాట్లాడారు. నాయకులు చిలమంద మునికృష్ణ, మునీశ్వరరెడ్డి, శివ శంకర్‌రాజు, నారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, సుధాయాదవ్ పాల్గొన్నారు. కాగా కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రగిరిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సోమవారం జరిగిన బాబు షూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి కోరారు.

మాపై అక్రమ కేసులు : వైసీపీ

చంద్రగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులతో తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చంద్రగిరిలో నియోజకవర్గ వైసీపీ నేతలు సోమవారం ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమ కేసులు పెడుతున్నారని నేతలు సింహాల మోహన్, యద్దల చంద్రశేఖర్ రెడ్డి, మస్తాన్, కొటాల చంద్రశేఖరరెడ్డి, దామినేటి కేశవులు, ఎంపీపీలు హేమేంద్ర కుమార్‌రెడ్డి, బాబురెడ్డి, నాయకులు నరేష్ కుమార్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు.

గురుకులాల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు గురుకులాల జిల్లా సమన్వయకర్త పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. రామకుప్పం బాలుర పాఠశాలలోని ఐదో తరగతిలో 41 సీట్లు, ఆరో తరగతిలో ఎనిమిది, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీలో 18, బైపీసీలో తొమ్మిది సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. విజలాపురం బాలుర గురుకుల విద్యాలయంలో ఐదో తరగతిలో 35 సీట్లు, ఆరో తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో రెండు, చిత్తూరులో బాలికలకు ఐదో తరగతిలో 27 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీలో ఐదు, బైపీసీలో ఒకటి, పలమనేరులో ఐదో తరగతిలో ఆరు, ఎనిమిదో తరగతిలో ఒకటి, ఎంఈసీలో 30, సీఈసీలో నాలుగు, కుప్పంలో బాలికలకు ఐదో తరగతిలో 41, ఏడో తరగతిలో ఒకటి, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీలో తొమ్మిది, బైపీసీలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన బాల, బాలికలు ఆయా గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి సీట్లను పొందాలని కోరారు.

బీఎల్వోలకు రెట్టింపు గౌరవ వేతనం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తయారీలో కీలక పాత్ర పోషించే బూత్ లెవ్ ఆఫీసర్ల(బీఎల్వోల)కు ఏడాది కాలానికిచ్చే గౌరవ వేతనాన్ని రెట్టింపు చేశారు. అలాగే ఇప్పటి వరకు కేవలం బీఎల్వోలకు, సూపర్‌వైజర్లకు మాత్రమే గౌరవ వేతనం చెల్లించేవారు. తాజాగా అసెంబ్లీ నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో), సహాయ ఈఆర్వోలకు కూడా గౌరవవేతనాన్ని చెల్లించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. 2015వ సంవత్సరం తర్వాత ఇప్పుడు మరోసారి గౌరవ వేతనాన్ని పెంచారు. ఏడాదికాలానికి బీఎల్వోలకు రూ.6వేల నుంచి రూ.12వేలకు, సూపర్‌వైజర్లకు రూ.12వేల నుంచి రూ.18వేలకు పెంచారు. ఈసారి నుంచి ఈఆర్వోలకు రూ.30వేలు, ఏఈఆర్వోలకు రూ.25వేల చొప్పున చెల్లిస్తారు. ఉత్తమ పనితీరు చూపే బీఎల్వోలకు ప్రోత్సాహకం కింద మరో రూ.6వేలను ఇవ్వనున్నారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని అలంకరించి మంగళ హారతులు సమర్పించారు.

తిరుత్తణి తరహాలో ఆనందగిరి అభివృద్ధి

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే నాని సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

పాకాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందగిరి (పాళ్యం కొండ)పై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని తిరుత్తణి తరహాలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల విజయవంతానికి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపడానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని రూ.1,00,116 అందజేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ నాగరాజనాయుడు, జిల్లా దేవదాయశాఖ కమిషనర్ పి.రామకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మెన్ సొంపల్లి చంద్రశేఖర్ నాయుడు, ఈవో యువరాణి, సర్పంచ్ గౌరీశంకరరాజు, తహసీల్దార్ సంతోష్‌సాయి, ఎంపీడీవో శశిరేఖ, డీఎల్‌పీవో సురేష్‌నాయుడు, సీఐ సుదర్శన ప్రసాద్, పీఆర్‌డీఈ మురళీధర్, నాయకులు కె.సుధాకరయ్య, కె.సావిత్రి, ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి శర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సత్యకుమార్



ఈడిగపల్లె వద్ద విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే థామస్

వెదురుకుప్పం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్ వెల్లడించారు.త్వరలో వంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సొంత భవన వసతి కల్పించడానికి రూ.194 కోట్లతో పనులు చేపడతామని చెప్పారు.కార్వేటినగరం మండలం ఆలత్తూరు పంచాయతీ ఈడిగపల్లి వద్ద రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటి పరిశీలనకు వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మెడికల్ ఆఫీసర్ వద్దకు అవసరమైతే పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్యం అందించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా 14 రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు 105 రకాల మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి త్వరలోనే భూమి పూజ చేస్తామన్నారు. ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సీహెచ్‌సీలకు అవసరమైన భవన వసతి నిర్మాణ పనులను వేగవంతం చేయిస్తామన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో అనేక పరిశ్రమలు రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని వెల్లడించారు.డీఎంహెచ్‌వో సుధారాణి,ఆర్డీవో అనుపమ,సర్పంచ్ పుష్పాంజలి, డాక్టర్లు భువనేశ్వరి, హేమశ్రీ, మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్ , యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, టీడీపీ మండల అధ్యక్షులు చెంగల్రాయయాదవ్, గంధమనేని జయశంకర్‌నాయుడు, స్వామిదాస్, రుద్రప్పనాయుడు,బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్‌నాయుడు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, సీనియర్ నాయకులు చిట్టిబాబు, కాపు సేన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణంలో దోచుకున్న సొమ్మంతా కక్కిస్తాం

మంత్రి సత్యకుమార్



మంత్రి సత్యకుమార్‌తో ఎమ్మెల్యే థామస్, కోకకోలా కంపెనీ ప్రతినిధి ప్రియదర్శన్

పాలసముద్రం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేసి శిక్షిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. కోకకోలా కంపెనీ సహకారంతో పాలసముద్రం పీహెచ్‌సీలో నిర్మించిన మరుగుదొడ్లను, ఆపరేషన్ థియేటర్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. శాంతిపురం, విజయపురం, చౌడేపల్లె, తవణంపల్లెల్లోని పీహెచ్‌సీల్లోనూ కోకకోలా కంపెనీ సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లను, ఆపరేషన్ థియేటర్లను వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు.అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ధనదాహంతో నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడారని గుర్తుచేశారు. మద్యం కుంభకోణంలో దోచుకున్న వేలకోట్ల సొమ్మంతా కక్కిస్తామన్నారు.ప్రజలు కూడా ఆలోచించి కూటమి ప్రభుత్వానికి అండదండలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విప్ థామస్ మాట్లాడుతూ.. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సీసీరోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌వో సుధారాణి,ఆర్డీవో అనుపమ, ఎంపీపీ శ్యామలాశివప్రకాష్‌రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీష్, కోకకోలా కంపెనీ ప్రతినిధి హిమామ్ ప్రియదర్శన్, తహసీల్దార్ అరుణకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నాయకులు వాసు నాయుడు, శివా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల వివాదం : ట్రాఫిక్‌కు అంతరాయం

● రాత్రివేళ టీడీపీ నాయకుల నిరసన



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌పురంలో బ్యానర్ల వివాదంతో ఆదివారం రాత్రి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆదివారం మధ్యాహ్నం టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు స్వాగతం పలుకుతూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున బ్యానర్లు శ్రీకాళహస్తి-తడ రోడ్డు, వీఎస్‌పురం జంక్షన్లలో ఏర్పాటు చేశారు. కార్యక్రమం ముగిశాక అరుంధతీయవాడకు చెందిన ఒకరు ఇంటి పైకప్పుపైన వేసుకోవడానికి ఒక బ్యానరు కావాలని అడిగారు. ఇందుకు టీడీపీ నాయకుడొకరు సరేనన్నారు. ఇది చూసి మరికొందరు మిగిలిన బ్యానర్లు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కోపోద్రిక్తుడయ్యారు. రాత్రి 9గంటల సమయంలో అనుచర గణంతో శ్రీకాళహస్తి-తడ రహదారిపై కారును అడ్డంగా పెట్టారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌లో 108 అంబులెన్స్ కూడా ఇరుక్కుంది. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు, ఎస్ఐ సుధీర్‌రెడ్డిలు చేరుకుని సర్దిచెప్పినా నాయకులు ససేమిరా అన్నారు. గంట తరువాత ప్రయాణికులు తిరగబడే సందర్భంలోనాయకులు వెళ్లిపోయారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ ప్రసూన పాసం దంపతులు తమ కుమార్తె నిత్య తన్వి పేరుమీద రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈవో బాపిరెడ్డి విరాళాన్ని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

65 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో అక్రమంగా నిల్వచేసిన 65 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసు కున్నారు. రెవెన్యూ అధికారుల వివరాల మేరకు... గాంధీనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు తన ఇంట్లో 65 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వవుంచినట్లు అధికారులకు సమాచారం అందింది. విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

దొరవారిసత్రం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మినమనమూడి గ్రామానికి చెందిన నల్లపాటి సుబ్బమ్మ(50) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ నెల 2న సుబ్బమ్మ ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది.

31లోపు కుప్పానికి కృష్ణా జలాలు

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



రామకుప్పం సింగిల్ విండో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభలో మాట్లాడుతున్న శ్రీకాంత్

రామకుప్పం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీ లోపు కుప్పానికి కృష్ణా జలాలు వస్తాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చెప్పారు.రామకుప్పం సింగిల్‌విండో చైర్మన్‌గా మహ్మద్‌రఫీ, డైరెక్టర్లుగా సురేష్, ఆంజప్ప సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో శ్రీకాంత్ మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు 87శాతం మేర పూర్తయ్యాయని చెప్పారు. మిగిలిన 13శాతం పనులు కూడా అప్పుడే పూర్తయ్యేవని, వైసీపీ నేతలు కుటిలబుద్ధితో కొంతమంది రైతులతో కోర్టులో కేసులు వేయించడం వల్ల జాప్యం జరిగిందన్నారు. అధికారంలో ఐదేళ్ళు కొనసాగిన వైసీపీ నేతలు కక్షపూరిత వైఖరితో మిగిలిన 13శాతం హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు పూర్తి చేయలేదన్నారు.తీరా ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఎన్నికల్లో లబ్ధి కోసం ట్యాంకర్ల ద్వారా హంద్రీ-నీవా కాలువలో నీరు పారించి, బటన్ నొక్కి అభాసు పాలయ్యారన్నారు.గత ఏడాది చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే హంద్రీ-నీవా కుప్పం కెనాల్ పనులు వేగవంతమయ్యేలా అధికారులను పరుగులు తీయించారన్నారు. కొద్ది రోజుల్లోనే ఆ పనులు పూర్తయి, ఈనెల 31లోపు కుప్పానికి జలాలు వస్తాయన్నారు.చంద్రబాబు నేతృత్వంలో కుప్పం నియోజకవర్గం రానున్న నాలుగేళ్ళలో ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. రైతులు, ప్రజల సౌకర్యం కోసం విమానాశ్రయం ఏర్పాటవుతోందన్నారు. విమానాశ్రయం కోసం భూములిచ్చి సహకరిస్తున్న రైతుల పట్ల టీడీపీ ఎంతో కృతజ్ఞతతో వ్యవహరిస్తోందన్నారు. 2018లో భూములిచ్చిన రైతులకు ఇటీవల వడ్డీతో సహా నష్టపరిహారం చెల్లించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విమానాశ్రయంతో బాటు 500 ఎకరాల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ రెండు పనులు పూర్తయితే ఈ ప్రాంత ప్రజలు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తారన్నారు. అభివృద్ధి విషయంలో కుప్పం ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీజీ అడ్మిషన్లు వెంటనే చేపట్టండి

- పీజీసెట్ కన్వీనర్‌కు విద్యార్థి సంఘాల వినతి



తిరుపతి (విశ్వ విద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లో పీజీ అడ్మిషన్లు వెంటనే చేపట్టాలని విద్యార్థి సంఘాలు కోరాయి. ఏఐఎస్‌ఎఫ్ నేత చిన్నా, ఎస్‌ఎఫ్ఐ నేత అశోక్ తదితరులు పీజీసెట్ కన్వీనర్ వెంకటేశ్వర్లును కలిసి ఈ మేరకు విన్నవించారు. పీజీసెట్ ఫలితాలు విడుదలై నెల రోజులైనా అడ్మిషన్లు చేపట్టకపోవడం సరికాదన్నారు. వేలాది మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారని, యూనివర్సిటీలో స్వయంగా అడ్మిషన్లు నిర్వహించుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని కన్వీనర్ వెంకటేశ్వర్లు వారికి హామీ ఇచ్చారు.

ఎరువుల పంపిణీలో వైఫల్యం: వైసీపీ

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎరువులు నిల్వ ఉంచడంలో, పంపిణీ చేయడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందని ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. యూరియా, ఎరువుల కొరతతో పాటు రైతుల సమస్య పరిష్కరించాలని వైసీపీ నేతలతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్రంతో పనిలేకుండా రూ.20వేలు ఇస్తామని ఎన్నికల సభలో చెప్పి.. ఇప్పుడు రూ.5వేలు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీష, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, శ్రీకాళహస్తి, సత్యవేడు ఇన్‌ఛార్జులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి నూకతోటి రాజేష్, మల్లం రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు : సీడీపీవో



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తిరుపతి అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని రాస్ ఐసీడీఎస్ సీడీపీవో జి.సుధారాణి పేర్కొన్నారు. బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక టీకాలాగా పనిచేస్తాయని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళం సప్తగిరికాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గర్భిణులు, బాలింతలు, తల్లులతో ఆమె సమావేశమయ్యారు. తల్లిపాలు బిడ్డకు పట్టడం వల్ల కలిగే లాభాలు, పట్టకపోతే కలిగే దుష్ప్రభావాలు, అపోహలు, పాలు పట్టే విధానం గురించి వివరించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

మహిళలకు విద్యే వివేకానందుడి లక్ష్యం



అతిథులను సన్మానిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళలకు విద్యనందించడమే స్వామి వివేకానంద లక్ష్యమని స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ అన్నారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమ దశమ వార్షికోత్సవంలో రెండు రోజైన సోమవారం జరిగిన యువజన సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని, లక్ష్యాలను సాధించడానికి ఆత్మవిశాసం ముఖ్యమని పేర్కొన్నారు. పాజిటివ్ ఆలోచనలు అలవాటు చేసుకోవాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలన్నారు. ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ మహిళలు ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ, నెల్లూరు, తిరుపతి రామకృష్ణమిషన్ కార్యదర్శులు శితికంఠానందజీ, హృదానందజీ మహరాజ్, సుకృతానందజీ మహరాజ్, డాక్టర్ నిర్మల పాల్గొన్నారు.

ఎస్వీయూలో భద్రతా శిక్షణ కేంద్రం

- కార్మిక శాఖతో ఎస్వీయూ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖతో ఎస్వీయూ అవగాహన ఒప్పందం చేసుకుంది. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కమిషనర్ శేషగిరిబాబుతో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం విజయవాడలో సమావేశమై అవగాహన ఒప్పందంపై చర్చించి, సంతకాలు చేశారు. ఎస్వీయూలో భద్రతా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. పరిశ్రమల్లోని భద్రతా సిబ్బందికి నైపుణ్య శిక్షణ ఈ కేంద్రం ద్వారా అందించనున్నారు. కంపెనీ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌పై యూనివర్సిటీలో ఒక కోర్సును కూడా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహకారం ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ సీడీసీ డీన్ చెంగ్రాయుడు పాల్గొన్నారు.

ఆప్కో షోరూంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఆప్కో షోరూంలో దొంగలు పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ రైటర్ భానుప్రసాద్ వివరాల మేరకు.. గాంధీ రోడ్డులోని ఆప్కో షోరూంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళం పగులగొట్టి రూ.43వేలు అపహరించారు. ఆదివారం ఉదయం షోరూం తెరవడానికి వచ్చిన మేనేజర్ శ్రీనివాసులు షట్టర్ తాళం పగులకొట్టి ఉండడం గమనించి లోనికెళ్లి పరిశీలించారు. చిన్న బీరువాలో ఉంచిన రూ.43 వేలు కనిపించలేదు. వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి లైంగికదాడి



కార్తీక్

తిరుచానూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పంచాయతీ దామినేడు ఇందిరమ్మ హౌసింగ్ కాలనీలో లక్ష్మీ సౌజన్య కుటుంబ సభ్యులతో కలిసి ఉంటోంది. ఆమెకు ఏడు నెలల క్రితం వివాహమైంది. పక్క ప్లాట్‌లో తమిళనాడుకు చెందిన కార్తీక్ ఉపాధి కోసం వచ్చి సమీప బంధువుతో కలిసి ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం లక్ష్మీసౌజన్య ఒంటరిగా ఉండటం గమనించి లోనికి చొరబడ్డాడు. కత్తి చూపించి అరిస్తే చంపేస్తానని బెదిరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. రాత్రి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులకు ఆమె విషయం చెప్పింది. వారి ఫిర్యాదు మేరకు తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేసి, కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సేవలో కర్ణాటక గవర్నర్



అమ్మవారి ఆలయం వద్ద కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్

తిరుచానూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సోమవారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, అర్చకుడు బాబుస్వామి ఆయనకు ఆలయ మర్యా దలతో స్వాగతం పలికారు. మొదట ధ్వజ స్తంభానికి నమస్కరించి, సన్నిధి లోని అమ్మవారి మూలమూర్తిని దర్శించు కున్నారు. వేదపండితులు గవర్నర్‌కు వేదాశీర్వచనం చేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో సూపరింటెండెంట్ రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నిరుపేదల వివరాలు సేకరించండి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర, పక్కన ఏపీఎం నాగేశ్వరరావు

తిరుపతిరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అర్హులైన నిరుపేదల వివరాలను సేకరించి సచివాలయ సిబ్బందికి అందించడంలో సంఘమిత్రలు సహకారం అందించాలని ఎంపీడీవో కె.రామచంద్ర కోరారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం సంఘమిత్రలతో ఆయన సమావేశమయ్యారు. పీ4 పథకానికి బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారిని సచివాలయంలో నమోదు చేయించడంలో భాగస్వామ్యం కావాలన్నారు. వయోజన విద్యాధికారి శైలజ మాట్లాడుతూ నిరక్షరాస్యులైన వయోజనులను గుర్తించి అక్షరాంధ్ర ఉల్లాస్ ద్వారా అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంఈవో-1 మహమ్మద్ రఫీ మాట్లాడుతూ టెన్త్, ఇంటర్‌ను దూరవిద్య ద్వారా అధ్యయనం చేసే అవకాశం ఉందని, దీన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెలుగు మహిళా సమాఖ్య ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, ఎంఈవో-2శంకరయ్య, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

శెట్టిపల్లె భూసమస్యను పరిష్కరించాలి

- తుడా కార్యాలయం వద్ద బాధితుల ధర్నా - త్వరలోనే పరిష్కరిస్తామన్న తుడా చైర్మన్





సీపీఎం నాయకులతో కలిసి ధర్నా చేస్తున్న శెట్టిపల్లె బాధితులు, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

తిరుపతి(జీవకోన), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూ సమస్య పరిష్కరించాలంటూ బాధితులు సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక తుడా కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు, పాలకులు హామీలు ఇస్తున్నప్పటికీ అవి అమలుకావటం లేదన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు కాలయాపన చేసిందని, కూటమి ప్రభుత్వం రాగానే విన్నవించామని, ఇప్పటివరకు పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. 2019లో ఇచ్చిన జీవో ప్రకారం బాధితులకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. విషయం తెలుసుకున్న తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. త్వరలో జరగనున్న క్యాబినెట్ సమావేశంలో సీఎం చంద్రబాబుతో చర్చించి ఈ సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం తుడా చైర్మన్‌కు బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిపల్లి ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, సురేష్, సీపీఎం నేతలు జయచంద్ర, సాయిలక్ష్మి, వేణు, మాధవ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

వంటనూనెల దుకాణాలపై దాడులు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు సోమవారం తిరుపతిలోని వంటనూనెల హోల్‌సేల్ దుకాణాలపై దాడులు చేశారు. జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి జగదీష్ సిబ్బందితో కలిసి ఇందిరా ప్రియదర్శిని వెజిటబుల్ మార్కెట్, బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లోని వివిధ దుకాణాల్లో తనిఖీలు చేశారు. కొన్ని రకాల ఆయిల్స్ శ్యాంపిల్స్ సేకరించారు. బైరాగి పట్టెడలోని వివిధ బేకరీలు, స్వీట్ షాపుల్లో వాడుతున్న నూనెలను తనిఖీ చేశారు. శ్యాంపుల్స్‌గా సేకరించిన నూనెలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీటు దుకాణాల్లో వాడుతున్న వంట నూనెలు మిగిలితే ప్రభుత్వ గుర్తింపు పొందిన కుకింగ్ ఆయిల్స్ సేకరించే వెండర్‌కు మాత్రమే విక్రయించాలని కోరారు. వంట నూనెలు హోల్‌సేల్ వ్యాపారుల నుంచి కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు.

వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తిరుపతి(విద్య), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాలాజీ కాలనీలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం వేడుకగా జరిగింది. 1990 సంవత్సరంలో 10వ తరగతి చదివిన 164 మంది విద్యార్థుల్లో 52 మంది పాఠశాల వేదికగా కలిశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. చిన్ననాటి విషయాలను గుర్తుచేసుకుంటూ ఆనందం పంచుకున్నారు. తాము చదివిన పాఠశాలకు తమవంతుగా ఏదైనా చేయాలని తీర్మానించుకుని డైనింగ్ హాల్‌కు పెయింటింగ్ చేయించాలని, స్కూల్ ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్ నిర్మాణం చేయాలని నిర్ణయించారు. చివరిగా ఈ అపూర్వ సమ్మేళనాన్ని సాకారం చేసిన ఆనాటి స్కూల్ పీపుల్ లీడర్ పి.హేమాద్రి, ఎంఎం ప్రేమ్‌చంద్, నాగప్రతాప్, సలీంలకు కృతజ్ఞతలు తెలిపారు.

నిషేధిత సైలెన్సర్లు, హారన్లు బిగిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఆటో మొబైల్ మెకానికల్‌లు నిబంధనలను అతిక్రమించి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలకు సైలెన్సర్లు, హారన్లు బిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి హెచ్చరించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సోమవారం మెకానిక్‌లతో ఆయన సమావేశమయ్యారు. శబ్ధ కాలుష్యం చేసే హారన్లు బిగించడం పూర్తిగా నిషేధించామన్నారు. వ్యాపార దృక్పథంతో ఏర్పాటు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

గాంధీపురం మఠం భూమిలో వివాదం

మాదంటే మాది అంటూ ఇరువర్గాల వాగ్వాదం



ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేస్తున్న దృశ్యం



రాళ్లు తొలగిస్తున్న మరో వర్గం

తిరుపతిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ సర్వే నంబరు 13లోని హథీరాంజీ మఠానికి సంబంధించి ఎకరాకు పైగా విస్తీర్ణంలోని ఖాళీ స్థలాన్ని రెండు వర్గాలకు చెందిన వారు తమదంటే తమదని అంటుండటంతో వివాదంగా మారింది. ఈ సర్వే నంబరులో మదర్ డెయిరీ ప్రహరీని ఆనుకుని 1.09ఎకరాల ఖాళీ జాగా ఉంది. రైతుల ఆధీనంలో ఉన్న ఈ భూమిని గతంలో కొందరు కొనుగోలు చేయడంతో ఇప్పటికే క్రయ, విక్రయాల ద్వారా పలువురి చేతులు మారింది. కాగా నగరానికి చేరువగా నివాసానికి అనువుగా ఉండటంతో ఇక్కడి భూములకు విలువ అమాంతంగా పెరిగింది. అంకణం రూ.లక్షకు పైగా ధర పలుకుతోంది. దీన్ని ఆనుకుని ఇప్పటికే కొందరు ఖరీదైన బహుళ అంతస్తుల భవనాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలం తమదంటూ కొందరు సోమవారం ఉదయం ఎక్స్‌కవేటర్ సాయంతో చదును పనులు ప్రారంభించారు. ఈ సమాచారంతో మరికొందరు అక్కడికి చేరుకుని దీన్ని తాము కొనుగోలు చేశామని అడ్డుకున్నారు. ఇరువురి మధ్య కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువురికి ఉన్న పత్రాలను తీసుకురావాలని, అప్పటివరకూ ఎవ్వరూ దీనిలోకి ప్రవేశించకూడదని సూచించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన స్థానిక నేతలు ఈ స్థల వివాదంలో భాగస్వాములయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నా మఠం అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేడు ప్రభుత్వ కార్యాలయాల వద్ద

'రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం'

తిరుపతి(విద్య), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద "రండి... టీ తాగుతూ మాట్లాడుకుందాం" కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు వైజేపీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వాలు మారినా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదని, వేలకోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు కోల్పోతున్న ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాల గురించి వారికి వివరించి అవగాహన కల్పించడమే కాకుండా రానున్న కాలంలో పోరాటాలకు సిద్ధం చేసేందుకుగాను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

పిల్లర్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



తిరుపతి అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మంగళం క్వార్టర్స్ కరకంబాడి మార్గం ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు పిల్లర్ దిమ్మెపై ఏర్పాటు చేశారు. గతనెల 24న ఆంధ్రజ్యోతిలో పొంచివున్న ప్రమాదం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆ ప్రాంత విద్యుత్ విభాగం అధికారులు పక్కనే ఖాళీగా ఉన్న పిల్లర్‌పై ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్పుచేసి పాత దిమ్మెను కూల్చివేశారు. దీంతో స్థానికులు, వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

IN THE COURT OF THE HON'BLE V-ADDITIONAL CIVIL JUDGE (JUNIORDIVISION), TIRUPATI
O.S.No.889 of 2024
T.Kumari .... Plaintiff
Vs...
Durgam Bhaskaraiah............Defendant
SUIT SUMMONS TO DEFENDANT BY WAY OF SUBSTITUTE SERVICE
To
Sri Durgam Bhaskaraiah, S/o Chengalrayulu,Quarters No.445, D-Type Quarters,Vinayaka Nagar, Near ISCON Temple,Tirupati Town and Urban Mandal, Tirupati District
Take notice that, the Plaintiff has filed the above suit against you which stands posted to **28-08-2025** for your appearance. Hence you are hereby required to appear before the above named Court on the aforesaid date at 10.30 a.m. onwards either in person or through an advocate and file your objections else, the matter will be decided as exparte.
Hearing Date: 28-08-2025
B.L. ABILASH,
S. HARISCHANDRA PRASAD,
Advocates, Tirupati.

IN THE COURT OF THE III ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) TIRUPATI
O.S.No. 512 of 2024
D.Vittal Babu ...Plaintiff
V/s
Thokala Lakshmi Rajyam ...Defendant
Suit summons to the Defendant
Thokata Lakshmi Rajyam W/o S.Ramakrishna, R/o Door No.11-86/1, Telephone Colony, Oteru Road, Srinivasapuram, Tirupati Rural Mandal
Please take suit summons that in the above suit filed by the plaintiff against you is posted to 09-09-2025 for your appearance before the above court. If you got any objections, attend the above court on the above date at 10-30 a.m. and file the same. Failing which the matter will be decided exparte.
HEARING DATE: 09-09-2025
D. JAYACHANDRA
ADVOCATE TIRUPATI

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, KUMAR SWAMY GURIJALA (Old Name), S/o RAMAKRISHNAIAH NAIDU GURIJALA, R/at D.No. 2-506, Sai Sarnidhi Colony, Near ION Digital Zone, Cherlcpalli, Pudipatla, Tirupati Rural (M)-517505, Tirupati Dist, AP. I have changed my name to KUMARA SWAMY GJRIJALA (New Name). Henceforth, I will be known as KUMARA SWAMY GURIJALA.
AJT -1506

CHANGE OF NAME
I, Cilaguntpalli Dhanalakshmi W/o C.Siva, R/at D.No.4-134 Rickshaw Colony, Near S.V.Zoo Park, Cherlopalli, Tirupati Rural Mandal and District, AP. have changed my son name from C.STEEPHAN to C.CHARAN TEJA.
AJT -1505

WANTED
తిరుపతిలో ప్రముఖ కంపెనీ నందు బట్టలు ఐరన్ చేయుటకు అనుభవం కలిగిన వ్యక్తులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 99631 86385, 93812 15592
AJT -239891

VOCATIONAL COURSES
తిరుపతిలో Dr.VBR ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 10th పాస్ అయిన వాళ్ళకి ఒకేషనల్ కోర్సులు ANM/MPHW-F (నర్సింగ్)/ MLT/ వెటర్నరీ/డైరీ సైన్స్/ అగ్రికల్చర్ సీట్లు Inter BiPC తో కలవు. & ఇంటర్ పాస్ అయిన వాళ్ళకి BSc(నర్సింగ్), BPT, BSc MLT, GNM, డిప్లొమా పారామెడికల్ కోర్సులు కూడా కలవు. సంప్ర: 81250 40004
AJT -1508

WANTED
తిరుపతిలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు 5-10 సం॥ అనుభవం గల ఆఫీసు ఎగ్జిక్యూటీవ్ (వివాహిత) డిగ్రీ కంప్యూటర్ పరిజ్ఞానం కావలెను. సంప్ర: 96760 22100.
AJT -1502

తుడా అప్రూవల్ ప్లాట్స్
IT హబ్, IIT,IISER ఏర్పేడు ఇండస్ట్రియల్ ఏరియాలో బ్యాంకులోన్ ఇన్‌స్టాల్‌మెంట్స్ అతితక్కువ ధరలకే స్పాట్ రిజిస్ట్రేషన్. శ్రీసాయి చైతన్య డెవలపర్స్ మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్ర: 91105 49394
AJT -239892

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237937

క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నష్టపోయిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



కుమారుడితో కిరణ్ అబ్బవరం దంపతులు

స్వామి సన్నిధిలో 'హను అబ్బవరం'

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): స్వామి సన్నిధిలో తన కుమారుడికి 'హను అబ్బవరం' అని నామకరణం చేసినట్టు సినీ హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. భార్య నటి రహస్య, కుమారుడితో కలిసి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. హనుమజ్జయంతి రోజున పుట్టినందున కొడుక్కి హను అబ్బవరం అని పేరు పెట్టుకున్నామని చెప్పారు. ప్రస్తుతం 'చెన్నై లవ్ స్టోరీ', 'కె ర్యాంప్' సినిమాల షూటింగ్ జరుగుతోందన్నారు.





ఆలయం వద్ద సూర్య, జ్యోతిక దంపతులు - కుమారుడు దేవ్, కుమార్తె దియా

తిరుమలలో సూర్య, జ్యోతిక

ప్రముఖ తమిళ హీరో సూర్య, జ్యోతిక దంపతులు సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి తిరుమలకు చేరుకున్న వీరు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తమ ఇద్దరు పిల్లలు దేవ్, దియా పాటు స్వామిని దర్శించుకున్నారు. సూర్య దంపతులను చూసేందుకు, వారితో సెల్ఫీల కోసం అభిమానులు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.25 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,628

తలనీలాలు సమర్పించినవారు: 30,339



టీటీడీకి విరాళంగా ఎలక్ట్రిక్ స్కూటర్



టీటీడీకి సోమవారం ఓ ఎలక్ట్రిక్ స్కూటర్ విరాళంగా అందింది. విజయవాడకు చెందిన క్వాంటం ఎనర్జీ లిమిటెడ్ ఎండీలు శ్రీనివాస్, చక్రవర్తి రూ.1.05 లక్షల విలువైన బిజినెస్ ఎక్స్‌పీ స్కూటర్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విద్వేషాలను రెచ్చగొట్టేవారి పనిబట్టండి స్వామీ!

● మంత్రి కొలుసు పార్థసారధి

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎక్కడైనా, ఎవరైనా విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే- అటువంటి వాటిని అణగదొక్కాలని స్వామిని ప్రార్థించానని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ నీటితో కళకళలాడుతున్నాయన్నారు.



కొలుసు పార్థసారధి

అప్పర్ సీలేరుకు బయలుదేరిన తిరుపతి కబడ్డీ జట్టు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తిరుపతి విద్యుత్ ఉద్యోగుల కబడ్డీ జట్టు

తిరుపతి(ఆటోనగర్), ఆగష్టు4(ఆంధ్రజ్యోతి): అప్పర్‌సీలేరులో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి సర్కిల్ జట్టు బయలు దేరి వెళ్ళినట్లు ఆ జట్టు మేనేజరు స్పోర్ట్స్ కార్యదర్శి లీలారామ్ తెలిపారు. అప్పర్ సీలేరులో రాష్ట్ర స్థాయిలో విద్యుత్ ఉద్యోగులకు కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఉంటాయని చెప్పారు. గత వారం రోజుల నుంచి జట్టు మేనేజరు టి.జయరామ్ అధ్వర్యంలో కబడ్డీ క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చారని కార్యదర్శి చెప్పారు. గతంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తిరుపతి సర్కిల్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి తమ జట్టు ప్రథమ స్థానం సాధిస్తుందని ఆశిస్తున్నామని ఆయన తెలిపారు.

అన్నప్రసాద నాణ్యత ఎలా ఉంది?

● భక్తులతో మాట్లాడిన ఈవో, అదనపు ఈవో

తిరుమల, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాల నాణ్యత ఎలా ఉందంటూ టీటీడీ ఈవో శ్యామలరావు అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఆయన అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాల నాణ్యత, రుచిని స్వయంగా పరిశీలించారు. అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న కొందరు భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయలు తెలుసుకున్నారు. వీరూ భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీరించారు. తర్వాత కియోస్క్ మిషన్ ద్వారా ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు విరాళమిచ్చారు. అన్నప్రసాద భవనంలోని క్యూలైన్లు, పరిశుభ్రత, ముడి సరుకుల నిల్వ గది తదితర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. గ్యాస్ ప్లాంట్‌నూ పరిశీలించారు. ఈకార్యక్రమంలో అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



భక్తుల అభిప్రాయం తెలుసుకుంటున్న ఈవో, అదనపు ఈవో

'అమరరాజా'లో హరియాణా మాజీ డిప్యూటీ సీఎం

రేణిగుంట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం కరకంబాడి, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలోని అమరరాజా పరిశ్రమను హరియాణా మాజీ ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ సింగ్ చౌటాల సోమవారం సందర్శించారు. పరిశ్రమలోని పచ్చదనం అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అమరరాజా గ్రూప్ పరిశ్రమలు దేశంలో వ్యాపార మేధస్సు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రతీక అని కొనియాడారు. పరిశ్రమ లోపల పర్యావరణం, పరిరక్షణ, నాణ్యత ప్రమాణాలు, సమాజ అభివృద్ధి వంటి అంశాలలో అమర గ్రూప్స్ చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమరరాజా గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గల్లా జయదేవ్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ నరసింహలునాయుడు పాల్గొన్నారు.



అమర్ రాజా పరిశ్రమలో మొక్కలు నాటుతున్న దుష్యంత్ సింగ్ చౌటాల

భూసమస్యలు బోలెడు

● పరిష్కరించాలంటూ బాధితుల వేడుకోలు

● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 302 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): 'మా భూములు కబ్జా అయ్యాయి. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మీరైనా పరిష్కారం చూపండి' అంటూ ఎందరో బాధితులు మొరపెట్టుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 302 అర్జీలు రాగా, అందులో 162 భూ సమస్యలకు సంబంధించినవే. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని జేసీ ఆదేశించారు.వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...



వినతిపత్రాలను స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

వితంతు పింఛను ఇచ్చి ఆదుకోండి



'నా భర్త గ్రానైట్ వేసే కూలీపనికి వెళ్లేవాడు. పది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ పోషణ భారంగా మారింది. వితంతు పింఛను ఇప్పించి ఆదుకోండి' అంటూ గీత అధికారుల ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.



మా భూములు కబ్జా చేశారు.. పరిరక్షించండి

మాభూమిని గెరటయ్య అనే వ్యక్తి కబ్జా చేశాడంటూ బాలాయపల్లి మండలం వాక్యం గ్రామానికి చెందిన విజయమ్మ, మరికొందరు కలిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. 'గ్రామంలోని 8 ఎకరాల్లో 30 ఏళ్లుగా వర్షాధారంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ఐదేళ్ల కిందట నిమ్మ మొక్కలు నాటాం. గెరటయ్య దౌర్జన్యంగా ప్రవేశించి నిమ్మ చెట్లను తొలగించారని తిరిగి పెన్సింగ్ వేస్తే దానిని దౌర్జన్యంగా తొలగించాడని బాధితులు అధికారులెదుట వాపోయారు. ఇలా పంటలపై దౌర్జన్యం చేస్తుండటంతో సదరు భూమిపై కబ్జాదారులుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మా ఇంటి స్థలం కబ్జాచేశారు.

'మాది నిరుపేద కుటుంబం. నా వికలత్వ పించనుతో తల్లిదండ్రులను పోషించుకుంటున్నా. ఆరు సెంట్ల ఇంటి స్థలాన్ని చెల్లయ్య, తిరుపాలు తదితరులు కబ్జా చేశారు. నేను వికలాంగుడిని కావడంతో నాపై దౌర్జన్యం చేసి దూషిస్తున్నారు' అంటూ సత్యవేడుకు చెందిన సౌందరరాజ్ ఆవేదన చెందారు. కబ్జాదారులు ఆక్రమించిన ఇంటి స్థలాన్ని తిరిగి ఇప్పించాలని అధికారుల ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు.



మౌలిక వసతులు కల్పించండి

మాది పుత్తూరు మండలం నంది మంగళం పంచాయతీలోని ఎన్టీఆర్ కాలనీ. మా దళిత వాడలో మౌలిక వసతులు కల్పించండి.. అంటూ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. కోనేటిపాళెంలో దళితవాడకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, ఇంటి స్థలాలు కల్పించాలని కోరారు. లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలన్నారు.





22 ఏ నుంచి మా భూములకు విముక్తి కలిగిచండి

తిరుపతి రూరల్ మండలం దామినేడులోని 22/ఏ నుంచి తమ భూములకు విముక్తి కలిగించాలని దామినేడు ప్లాట్ల సంక్షేమ సంఘం నేతలు అధికారులను కోరారు. నిషేధిత జాబితా నుంచి తొలిగించి తమకు న్యాయం చేయాలన్నారు.

పాఠశాలను తొలగించవద్దు

1958వ సంవత్సరంలో మా గ్రామంలో రాజానగరం (పిచ్చాటూరు మండలం)లో ఎంపీపీ స్కూల్ ఏర్పాటు చేశారు. 1986లో ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 3, 4, 5 తరగతులను వేలూరు గ్రామానికి తరలించారు. తిరిగి మా పాఠశాలను మోడల్ ప్రైమరీ స్కూల్ చేసినట్లయితే ఉన్నత పాఠశాల మనుగడ సాధిస్తుంది.



ప్రజా ఫిర్యాదులు పరిష్కారంలో బాధ్యతగా పనిచేయండి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖపై ఎంతో నమ్మకంతో జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయానికి విచ్చేసి తమ బాధలను, సమస్యలను ఆవేదన రూపంలో చెప్పుకోవడానికి వస్తున్నారు. అటువంటి వారి సమస్యలను బాధ్యతగా పట్టించుకుని పరిష్కరించాలని ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. ఆయా పోలీసు స్టేషన్లలో అధికారులు స్పందించని పక్షంలో అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. తిరుపతిలో సోమవారం ఎస్పీ నేతృత్వంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 102 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను ఎస్పీ ఎదుట ఏకరువు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, డీఎస్పీలు వెంకటనారాయణ, సీఐలు సాధిక్ ఆలీ, సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఫిర్యాదులు తీసుకుంటున్న ఎస్పీ

సంస్కృత వర్సిటీలో వైభవంగా భాషోత్సవం

● శోభాయాత్రలో పాల్గొన్న వివిధప్రాంతాల ప్రతినిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భాషోత్సవం పేరుతో రెండు రోజులపాటు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహించే జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ప్రారంభ సూచకగా యూనివర్సిటీలోని స్వామి నారాయణ అక్షర పురుషోత్తమ మండపం నుంచి సభా ప్రాంగణం దాకా శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు భవనంలో నిర్వహించిన ప్రారంభ సభలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. చాలా ప్రాధాన్యత గల అంశంపై ఉత్కల పీఠం జాతీయ సదస్సు నిర్వహించడం శుభ సూచకమన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి ఆన్‌లైన్ ద్వారా అనుగ్రహ భాషణం చేశారు. న్యూఢిల్లీకి చెందిన స్వామి నారాయణ సంప్రదాయ అక్షరధామ్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్ స్వామి మాట్లాడుతూ.. పురుషోత్తమ భాష్యం అనేది ప్రస్థాన త్రయానికి సంబంధించినది అన్నారు. అక్షర పురుషోత్తమ భాష్యం రాయడానికి మునుపు ఇందులోని గొప్పదనాన్ని తెలుసుకోవాలని కోరారు. యూజీసీ వైస్ చైర్మన్ దీపక్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం సామాజికంగా ఎంత అవసరమో ఆలోచించాలన్నారు. దీనిని సామాజిక ఔన్నత్యానికి అవసరమైన విధంగా రూపొందించాలని సూచించారు. ఐసీపీఆర్ సభ్యుడు సచ్చిదానంద మిశ్రా మాట్లాడుతూ.. సంస్కృత భాషలోనే కాకుండా, ఇతర భాషల్లోనూ ప్రస్థాన త్రయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. సంస్కృత వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయం వల్ల మానవ జీవన విధానం గొప్ప స్థితికి చేరుతుందని అభిప్రాయపడ్డారు. ఢిల్లీలోని లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత వర్సిటీ వీసీ మురళీ మనోహర్ పాఠక్ మాట్లాడుతూ.. ప్రస్థాన త్రయ భాష్యం, క్రియాన్వయనం ఆధునిక సమాజ అవసరాలకు అనుగుణంగా ఎలా రూపొందించాలనే విషయంపై అవగాహన అవసరమన్నారు. గుజరాత్‌లోని సోమనాథ సంస్కృత వర్సిటీ వీసీ సుఖాంత్‌కుమార్ సేనాపతి మాట్లాడుతూ.. వేదాంతాది శాస్త్రాల్లో ప్రస్థాన త్రయానికి ఔన్నత్యం ఉందనీ, మంచి ఫలితాలు కూడా ఉన్నాయన్నారు. శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ రాణిసదాశివమూర్తి మాట్లాడుతూ.. వేద విజ్ఞానంలో ప్రస్థాన త్రయం గొప్ప ప్రాముఖ్యత కలదన్నారు. ఇందులోని విశేషాలను ఈ తరానికి అవసరమైన విధంగా విశ్లేషించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్కల పీఠం డైరెక్టర్ జ్ఞానరంజన్ పండా, సలహాదారు ప్రొఫెసర్ శంకర నారాయణ, పలు ప్రాంతాల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం

సీపీఐ జిల్లా ముగింపు సభలో మాజీ ఎమ్మెల్సీ విల్సన్

సూళ్లూరుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. సూళ్లూరుపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీపీఐ జిల్లా రెండో మహా సభల ముగింపు సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ సీపీఐ పుట్టినప్పటి నుంచి కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటు చేస్తోందన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలయ్యిందని ధ్వజమెత్తారు. ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకే మోదీ దేశాన్ని పాలిస్తున్నారని, ప్రజాస్వామ్యం బద్ధంగా ఏదీ జరగడం లేదన్నారు. ఒకే దేశం, ఒకే భాష, ఒకే మతం నినాదంతో మత కలహాలు సృష్టించి రాజకీయంగా లబ్ధిపొందుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ, అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసి పేదల కడుపుకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రజాస్వామ్యం బద్ధంగా వ్యహరించకపోవడంతో ప్రజలు బుద్ధి చెప్పిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నేడు ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో కీలక భూమిక కమ్యూనిస్టులదేనని స్పష్టం చేశారు. అంతకుముందు సీపీఐ జిల్లా నాయకుడు మోదుగుల పార్థసారధి పార్టీ జెండా ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, చిన్నం పెంచలయ్య, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర, శివారెడ్డి, జయలక్ష్మి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

టీటీడీ ఆలయాలకు 'సౌభాగ్యం'

తిరుమల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): శుక్రవారం జరిగే వరలక్ష్మీ వ్రతం సందర్భంగా టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్తంగా టీటీడీకి చెందిన రెండు తెలుగు రాష్ట్రాల్లోని 51 ఆలయాల్లో సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సౌభాగ్యవంతులకు గాజులు, పద్మావతి అమ్మవారి కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, పసుపు దారాలు, అమ్మవారి లక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తక ప్రసాదాలు అందించనున్నారు. ఈ సందర్భంగా సుమంగళి ద్రవ్యాలను పంపిణీ చేసేందుకు ఓ అజ్ఞాత భక్తులు విరాళంగా అందించిన 8 లక్షల గాజులు, 1.40 లక్షల చొప్పున కంకణాలు, పసుపుదారాలు, కుంకుమ ప్యాకెట్లు, పుస్తకాలు ఆయా ఆలయాలకు పంపారు.

అమ్మవారికి కానుకగా 5వేల డజన్ల గాజులు

తిరుచానూరు, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 8న జరగనున్న వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని స్థానికులైన సివిల్ ఇంజనీర్ షర్మిళ షణ్ముగం దంపతులు 5వేల డజన్ల గాజులు, పదివేల కంకణాలు, పదివేల పసుపు కుంకుమ ప్యాకెట్లను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయడు పాల్గొన్నారు.



ఆలయాధికారులకు గాజులు, పసుపు కుంకుమ అందిస్తున్న దాత షణ్ముగం

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి మూడు రోజుల జైలు

తిరుపతి(నేరవిభాగం),ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ప్రత్యేక నాలుగవ అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. ఇతడితో పాటు మరో 18 మంది మందుబాబులకు రూ.10 వేల వంతున రూ.1.80 లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు

తిరుమల ఉద్యోగుల క్వార్టర్స్‌లో చోరీ

తిరుమల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఉద్యోగుల క్వార్టర్స్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.20 వేల నగదు, 12 గ్రాముల బంగారు బ్రాస్‌లైట్‌ను అపహరించారు. డీ టైప్ క్వార్టర్స్‌లోని మహేంద్ర అనే టీ వ్యాపారి ఇంట్లో ఆదివారం రాత్రి ఎవరూ లేని సమయంలో తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ సీఐ శ్రీరాముడు తెలిపారు. కాగా స్థానికులు నివాసించే బాలాజీనగర్‌లో 30 మంది పోలీసులు ఏరియా డామినేషన్ నిర్వహిస్తున్న సమయంలోనే ఈ చోరీ జరగడం గమనార్హం.



చోరీ జరిగిన ఇంటి పరిశీలిస్తున్న పోలీసులు

5 కిలోల గంజాయి స్వాధీనం - ఒకరి అరెస్టు

ఓజిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారికి సమీపంలో సోమవారం 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, బెంగళూరుకు చెందిన పటాన్ షారూక్‌ను ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేసేందుకు వెళుతుండగా పెద్దపరియ క్రాస్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి బ్యాగ్‌తో ఓ అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా బెంగళూరుకు చెందిన షారూక్‌గా తెలిసింది. పొంతనలేని సమాధానాలు చెప్పడంతో బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో 5 కిలోల గంజాయి లభ్యమైంది. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

పుత్తూరు వార్తలు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



పుత్తూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నరాజుకుప్పం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు విద్యా సామగ్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేష్ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్యావ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ధనపాల్, చంద్రయాదవ్, మధుసూదన్ రాజు, ఆదికేశవులు నాయుడు, గోవర్ధన్ నాయుడు, కుమార్‌రెడ్డి, మణికంఠ, పోతుగుంట రమేష్, జనార్ధన్ యాదవ్, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగ పుష్పాలంకరణలో పరమశివుడు

వడమాలపేట,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని భవాని శంకర దేవాలయం లో పరామశివుడు నాగపుష్పాలంకరణ తో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ సోమవారం మహాశివుని లింగానికి అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలు, నాగపుష్పాలతో అలంకరించారు. భక్తులు మంగళ హారతులిచ్చారు. వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆసుపత్రి పడకల స్థాయి పెంచాలని వినతి



మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం వెళ్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు సోమవారం పుత్తూరులో బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధ రాజు ఆహ్వానం మేరకు ఆగి అల్పాహార విందును తీసుకున్నారు. పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి స్థాయిని వంద పడకలకు పెంచాలని, మరో ముగ్గురు వైద్యులను నియమించాలని, డయాలసిస్ యూనిట్ ను ఏర్పాటు చేయాలని, వడమాలపేట మండలం బట్టీకండ్రిగలో పిహెచ్‌సి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నాయకులు మంత్రిని కోరారు. కార్యక్రమంలో జీడీనెల్లూరు ఎంఎల్ఏ థామస్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశేషుడిపై ఊరేగిన ధర్మరాజు



పుత్తూరు టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్య పూజా కైంకర్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వివిధ వేషధారణలలో అలరించారు. సాయంత్రం ధర్మరాజుల స్వామి ఆదిశేష వాహనంపై ఊరేగుతూ దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయదారులుగా కర్ణం కుమార్, సోదరులు వ్యవహరించారు. కమిటీ నిర్వాహకులు సాల్వాకం కృష్ణప్ప మెదలి, మాజీ చైర్మన్ యగందర్, సభ్యులు మునిచంద్ర, దామోదరం, కేశవపాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

పుత్తూరు,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అదేశించారు. స్థానిక గోవిందపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మండలంలోని వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 12న పాఠశాలల్లోని పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని అన్నారు. పీహెచ్‌సీ డాక్టర్లు రమేష్, ఆశ, ప్రవీణ్, హేమభూషణ్, చరణ్, నాగేంద్రబాబు,ప్రకాష్‌లు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

వడమాలపేట,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా సోమవారం మండలం లోని ఎస్బీ ఆర్ పురం లో తల్లులు, ఏఎన్‌ఎం లు ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో బిడ్డల తల్లులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. బిడ్డ పుట్టిన అర్ధగంట లోగా తల్లిపాలను అందిస్తే ఆరోగ్యం గా ఉంటారని అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో తల్లిపాల శ్రేష్ఠత పై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమం లో సూపర్ వైజర్ లలితమ్మ టాటా క్యాన్సర్ సిబ్బంది సంతోషి, ఏఎన్ ఏం భారతి, ఆశా వర్కర్లు మోహనమ్మ, మునిరత్నమ్మ, రూపావతి బిడ్డల తల్లులు పాల్గొన్నారు.

ఏడాది పాలనపై కరపత్రాల పంపిణీ



కదిరిమంగళంలో కరపత్రాలు అందిస్తున్న నాయకులు

వడమాలపేట,ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలోనే ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించిందని మండల టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ పెద్దబ్బరాజు చెప్పారు. సోమవారం కదిరిమంగళం పంచాయతీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, తాగునీటి వసతి కోసం బోర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు హేమావతి, శివరాయల్, బత్తినాయుడు పాల్గొన్నారు.

గోవిందుని భక్తులకు అన్నదానం



రాజగోపాల్‌స్వామిని సన్మానిస్తున్న దాత

వడమాలపేట, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గోవింద నామ స్మరణ భక్తి మార్గమని శ్రీ భగవత్ సేవా సమితి వ్యవస్థాపకులు రాజగోల్ స్వామి తెలిపారు. సోమవారం తమిళనాడులోని మాధవరం భగవత్ సేవా సమితి ఆధ్వర్యంలో పాదయాత్రగా విచ్చేసిన గోవింద భక్తులకు మండలంలోని వేమాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అన్నదానం చేశారు. గత 14 సంవత్సరాలుగా అన్నదానం చేయడం ఆనవాయితీ గా వస్తోంది. ఈ సందర్భంగా రాజగోపాల్ స్వామి, గోవింద భక్తులను సన్మానించారు. సుమారుగా 350 మందికి అన్నదానం చేశారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

65 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లో అక్రమంగా నిల్వచేసిన 65 బస్తాల రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ అధికారుల వివరాల మేరకు... గాంధీనగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు తన ఇంట్లో 65 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వవుంచినట్లు అధికారులకు సమాచారం అందింది. విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో వీఆర్‌వో వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

దొరవారిసత్రం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం మినమనమూడి గ్రామానికి చెందిన నల్లపాటి సుబ్బమ్మ(50) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ నెల 2న సుబ్బమ్మ ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారకస్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున సుబ్బమ్మ మృతి చెందింది.

విధి నిర్వహణలో అలసత్వాన్ని ఉపేక్షించను: కురుగొండ్ల



బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహణ, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, బీసీ గురుకుల పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయో తెలుసుకొనేందుకు తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహణ తీరును ఎమ్మెల్యే పరిశీలించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో నరసింహులు, ఎంఈవో బామయ్య మాత్రమే హాజరు కావడాన్ని గమనించిన ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సోమవారం నిర్వహించే ప్రజా విజ్ఞప్తుల దినానికి అధికారులు హాజరు కాకపోవడం దారుణమన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామన్నారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిని తనిఖీ చేసి వైద్య సేవలు ఎలా ఉన్నాయి.. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని రోగులను ఆరా తీశారు. అలాగే సిబ్బందితో మాట్లాడి ఆస్పత్రిలో సమస్యలను తెలుసుకొన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. తరువాత బీసీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. మరుగుదొడ్లు సరిపోవడం లేదని, తరగతి గదులు, వసతి గదులు ఒక్కటే కావడం వల్ల ఇబ్బందిగా ఉందని విద్యార్థులు చెప్పారు. సంబంధిత శాఖ మంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి: పాశం



సర్పంచు సుజాత, ఆమె భర్త రామయ్య దంపతులకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

కోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుకు పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని సిద్ధవరం, గోవిందపల్లి, దొరువుకట్ట, దైవాలదిబ్బ గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు మహిళలు హారతులు పట్టి పూలవర్షం కురిపించి స్వాగతం పలికారు. టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి కూటమి పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందించారు. సిద్ధవరంలో స్థానిక సర్పంచ్ ఇంగిలాల సుజాత, ఆమె భర్త ఇంగిలాల రామయ్యతో పాటు పెద్దసంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నాయకుడు చిల్లకూరు దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ చేరారు. వారికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే గోవిందపల్లి, దైవాలదిబ్బలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అనంతరం గోవిందపల్లి గ్రామానికి దొరువుకట్ట గ్రామానికి చెందిన చిల్లకూరు రామసుబ్బారెడ్డి, సుశీలమ్మ జ్ఞాపకార్థం రూ.7 లక్షలతో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కొత్తపట్నం పంచాయతీలోని ఉయ్యాలమ్మ కిసాన్ గ్రూపునకు రూ.9.80 లక్షలు విలువచేసే డ్రోన్‌ను 80శాతం సబ్సిడీతో అందజేశారు. సీడీపీవో మునికుమారి ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలను చేయగా ఎమ్మెల్యే సునీల్‌కుమార్ సారె అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ నల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, రామలింగారెడ్డి, మురళి, చెంగల్‌రావు, చిన్ని వెంకటకృష్ణయ్య, కోటేశ్వరరావు, రామ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మహర్దశ: విజయశ్రీ



తడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పడుతుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం రాత్రి ఆంధ్రజ్యోతితో విజయశ్రీ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్లు, దొరవారిసత్రం మండలం దొరవారిసత్రం నుంచి పూలతోట వరకు 7 కిలోమీటర్లు, పెళ్లకూరు మండలం చెంబేడు, పునబాకలో 5 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, ఈ రెండు రోడ్లలో దొరవారిసత్రం, పూలతోటకు రూ.2 కోట్లు, చెంబేడు పునబాక రోడ్డుకు రూ.1.5 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆమేరకు ఆర్థికశాఖ నుంచి పూర్తి స్థాయి అనుమతులు సోమవారం వచ్చాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లను పట్టించుకున్న నాదుడే లేడన్నారు. ఎన్నికలకు ముందు తాము ఇచ్చిన హామీ ప్రకారం నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వారు సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

సంగమేశ్వరస్వామి ఆలయానికి కొండేపాటి దంపతులు రూ.2.50 లక్షల విరాళం

కోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలోని కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 13న జరిగే కుంభాభిషేకం కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు రూ.2.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆ విరాళాన్ని గంగాప్రసాద్ అభిమానులు ఆలయానికి అందజేశారు. సంగమేశ్వర ఆలయంలోని కామాక్షీదేవి విగ్రహాన్ని పెకిలించి జీర్ణోద్ధరణ చేయనున్నారు. ఇందుకోసం అమ్మవారి విగ్రహాన్ని గర్భగుడి నుంచి తీసివేశారు. ఈనెల 13న మహాకుంభాభిషేకాలు, ప్రత్యేక హోమాల మధ్య అమ్మవారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించనున్నారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం జరపనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు సాత్విక్‌శర్మ తెలిపారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

డక్కిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఒక టీకాలా పనిచేస్తాయని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని కంథలవారిపల్లి, వెంబులూరు, దిగువ లింగసముద్రం ఎస్సీకాలనీ, మోపూరు రోడ్డు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వెంకటగిరి సీడీపీవో సంషాద్ బేగం మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యాన్ని, బిడ్డకు అందించే ముర్రుపాలలో ఉండే పోషకాల గురించి వివరించారు. తల్లులు తీసుకోవాల్సిన ఆహార నియమాలను తెలియజేశారు. కార్యక్రమంలో టాటా ట్రస్టు ప్రతినిధి లక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వినీషా, అంగన్‌వాడీ టీచర్ పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన

చిల్లకూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవరం ఎస్టీకాలనీలో సోమవారం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుకమ్మ తలల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. పుట్టినబిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో రమణమ్మ, తిప్పమ్మ, రోజా, రాజామణి, సునీత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణదారులపై చర్యలు

డక్కిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో చెరువులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రామాపురం గ్రామానికి చెందిన కొంతమంది దౌర్జన్యంగా తమ పొలాల్లో రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని అదే గ్రామానికి చెందిన బాధితులు బహుజన సమాజ్ పార్టీ నాయకుడు జోరేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తహసీల్దారు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ మండలంలో అనేక చెరువులు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించడం జరిగిందన్నారు. చెరువుల్లో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పలుగోడు చెరువులో ఆక్రమణలను తొలగించాలని ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశామన్నారు. చెరువులతో పాటు ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ ప్రసన్నరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెటర్నరీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా వినూ

తిరుపతిరూరల్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ తాత్కాలిక రిజిస్ట్రార్‌గా గన్నవరం వెటర్నరీ కళాశాల యానిమల్ జెనిటిక్స్ అండ్ బ్రీడింగ్ (ఏజీబీ) విభాగ ప్రొఫెసర్ ఆర్.వినూను నియమిస్తూ సోమవారం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ ఉత్తర్వులు జారీ చేశారు. 6నెలలకాలం గానీ లేదా ఈలోపు రెగ్యులర్ నియామకం జరిగే వరకు గానీ ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో మూడు రోజుల జైలుశిక్ష

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి ప్రత్యేక నాలుగో అదనపు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అతనితో పాటు మరో 18 మందికి రూ.10వేలు చొప్పున రూ.1.80 లక్షలు జరిమానా విధించారు.

జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులతో పాఠశాల సిబ్బంది

గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలకు ఎంపికైన స్థానిక జడ్పీ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థినులను హెచ్‌ఎం మాధవీలక్ష్మి అభినందించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన దీపిక, కౌసల్య, పింకి, శిల్ప, మౌనిక ఇటీవల నర్సారావుపేటలో జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో ప్రతిభ చాటిన దీపిక, కౌసల్య జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వ్యాయాయ ఉపాధ్యాయురాలు కల్పనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ భూములను పేదలకు పంచాలి

గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో పరిశ్రమల పేరుతో తీసుకున్న ప్రభుత్వ భూములు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని పేదలకు పంపిణీ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, వేమయ్య, సుబ్బరామరాజు, శ్రీహరి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఐజీ కుటుంబానికి ఎమ్మెల్సీ బీద పరామర్శ



జెట్టి పుల్లయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

ఓజిలి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కరబల్లవోలుకు చెందిన డీఐజీ గోపీనాథ్‌జెట్టి కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ బీదా రవించద్ర పరామర్శించారు. శనివారం గోపీనాథ్‌జెట్టి తండ్రి జెట్టి పుల్లయ్య మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎమ్మెల్సీ రవిచంద్రతోపాటు ఓజిలి, పెళ్లకూరు మండలాల టీడీపీ కన్వీనర్లు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య కరబల్లవోలు గ్రామానికి వెళ్లి జెట్టి పుల్లయ్యకు నివాళులర్పించారు. గోపీనాథ్ జెట్టి కుటుంబాన్ని పరామర్శించారు.

నిషేధిత సైలెన్సర్లు, హారన్లు బిగిస్తే చర్యలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పని చేస్తున్న ఆటోమొబైల్ మెకానికల్‌లు నిబంధనలను అతిక్రమించి ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలకు సైలెన్సర్లు, హారన్లు బిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి హెచ్చరించారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో సోమవారం మెకానిక్‌లతో ఆయన సమావేశమయ్యారు. శబ్ధ కాలుష్యం చేసే హారన్లు బిగించడం పూర్తిగా నిషేధించామన్నారు. వ్యాపార దృక్పథంతో ఏర్పాటు చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ సీఐ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆప్కో షోరూంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఆప్కో షోరూంలో దొంగలు పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ రైటర్ భానుప్రసాద్ వివరాల మేరకు.. గాంధీరోడ్డులోని ఆప్కో షోరూంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళం పగులగొట్టి రూ.43వేలు అపహరించారు. ఆదివారం ఉదయం షోరూం తెరవడానికి వచ్చిన మేనేజర్ శ్రీనివాసులు షట్టర్ తాళం పగులకొట్టి ఉండడం గమనించి లోనికెళ్లి పరిశీలించారు. చిన్న బీరువాలో ఉంచిన రూ.43 వేలు కనిపించలేదు. వెస్ట్ సీఐ మురళీమోహన్‌కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చిట్టమూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించ వచ్చని జిల్లా శిక్షణ కేంద్రం ఏవో కేవీ శ్రీనివాస్ తెలిపారు. చిట్టమూరు ఏవో నిరంజన్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద సోమవారం చిట్టమూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రానున్న రబీ వరి సాగులో రైతులు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. వరిలో ఎరువులు, నీటి యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. విత్తన శుద్ధి, జీలగలు దమ్ము చేసిన పది రోజుల తరువాత వరి నాట్లు వేసుకోవాలన్నారు. పది రోజుల లోపుల వేస్తే వేడి తాకిడికి వరి నాట్లు చనిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకులు సురేష్, కస్తూరయ్య తదితరులు పాల్గొన్నారు.

మాతమ్మ గుడి స్థలంలో ఆక్రమణను తొలిగించాలి

సూళ్లూరుపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట అయ్యప్పగుడి సమీపంలోని జీఎన్‌టీ రోడ్డులో మాతమ్మ గుడి స్థలాన్ని కొందరు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు చేపట్టారని, వెంటనే నిర్మాణాలను నిలిపి వేయాలంటూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కిరణ్మయికి కాంగ్రెస్ పార్టీ నాయకులు మాలగురం బాబు, వెంకటాచలపతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1972లో అరుంధతివాడకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను సైతం ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారని అన్నారు. అదే విధంగా మాతమ్మ ఆలయ స్థలాన్ని కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని, కనీసం దారి కూడా లేకుండా ఆక్రమించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీవో స్పందించి వెంటనే ఆక్రమణలు తొలిగించి న్యాయం చేయాలని కోరారు

గిరిజనులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు



తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజనులతో మట్టం శ్రావణి

గూడూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తిరుపతి పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఆమె మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన 50మంది గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో వారు సంక్షేమ పథకాలకు దూరమయ్యారని చెప్పారు. గిరిజనుల సమస్యను ఇన్‌చార్జి తహసీల్దారు ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి గుర్తింపు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వీటి ద్వారా ఆధార్ నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు విద్యే వివేకానందుడి లక్ష్యం



అతిథులను సన్మానిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళలకు విద్యనందించడమే స్వామి వివేకానంద లక్ష్యమని స్విమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ అన్నారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమ దశమ వార్షికోత్సవంలో రెండు రోజైన సోమవారం జరిగిన యువజన సమ్మేళనంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని, లక్ష్యాలను సాధించడానికి ఆత్మవిశాసం ముఖ్యమని పేర్కొన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని సాధనకు కృషి చేయాలన్నారు. ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ మహిళలు ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తి కలిగి ఉండాలన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ, నెల్లూరు, తిరుపతి రామకృష్ణమిషన్ కార్యదర్శులు శితికంఠానందజీ, హృదానందజీ మహరాజ్, సుకృతానందజీ మహరాజ్, డాక్టర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకస్వామికి అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామికి మొదట పాలు, పంచామృతం, చందనం, విభూధి, పచ్చకర్పూరంలో వైభవంగా అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి మంగళ హారతులు సమర్పించారు.

ఆక్రమణలు తొలగించాలని నిరసన


సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో గ్రామస్థుల నిరసన

శ్రీకాళహస్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం కర్లపూడిలో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించి పేదలకు పంచాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద గ్రామస్థులతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్ మాట్లాడుతూ కోవనూరు రెవెన్యూ సర్వే నెంబరు 262 బ్లాక్‌లో 54 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తే అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టారన్నారు. వాటిని ఆక్రమణదారులు పెరికివేసి భూమి తమదంటున్నారన్నారు. ఆక్రమణలను తొలగించి పేదలకు ఇంటి స్థలం, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు శ్మశానానికి స్థలం కేటాయించాలని ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి అంగేరి పుల్లయ్య, గంధమణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి


తహసీల్దారుతో టీడీపీ నాయకుల భేటీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలో రైతుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దారు భారతికి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గాలి మురళీనాయుడు కోరారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో రైతుల సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించాలని కోరారు. డీటీ జీవన్‌కుమార్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి


ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న అక్షింతల కృష్ణయాదవ్

శ్రీకాళహస్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మేళచ్చూరు ఎస్టీకాలనీ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని మండల టీడీపీ అధ్యక్షుడు అక్షింతల కృష్ణయాదవ్ కోరారు. సోమవారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని ఇటీవల గ్రామస్థులు కోరిన క్రమంలో ఆయన ఆర్టీసీ అధికారులను కలిశారు. బ్రాహ్మణపల్లి, బీవీపురం వరకు ఉన్న బస్సు సర్వీసును మేళ్లచూరు వరకు పొడగించాలని కోరారు. డీఎం స్పందించి బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు కేవీకే ప్రసాద్, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వర ఆలయ పుష్కరిణికి భూమిపూజ



నాగలాపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లిలోని పల్లికొండేశ్వర ఆలయ ఆవరణలో కోనేరు(పుష్కరిణి) నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే ఆదిమూలం భూమిపూజ చేశారు. ఆలయ అర్చకులు, కంచి కామకోటి మఠం అర్చక స్వాముల బృందం సమక్షంలో పూజలు నిర్వహించి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లత, ప్రధాన అర్చకులు కార్తికేయ గురుకుల్, భక్తులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యం


చిన్నారులతోఅంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ

కేవీబీపురం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) తల్లి పాలే బిడ్డకు ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత, రాజేశ్వర్లు చెప్పారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బాలింతలకు, గర్భవతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి ప్రసవించిన గంటలోపు పిల్లలకు తల్లిపాలను పట్టించాలని చెప్పారు. తల్లిపాలపై అవగాహనకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రసాద్, ధర్మారెడ్డి, అంగన్‌వాడీ మునీశ్వరి, అరుణ, సులోచన, లక్ష్మీ, పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చికిత్స


మొబైల్ క్యాన్సర్ స్ర్కీనింగ్ బస్ వద్ద వైద్య సిబ్బంది

కేవీబీపురం, ఆగస్టు 04 (ఆంధ్రజ్యోతి) క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చని తిరుపతి వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ క్యాన్సర్ వైద్యనిపుణులు పద్మావతి చెప్పారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ క్యాన్సర్ స్ర్కీనింగ్ యూనిట్ వాహనం ద్వారా రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ గురించి భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయరు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి రామ్‌నాయక్, రజనీ, వైద్య సిబ్బంది, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అంకాళమ్మ పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ


హోమంలో పాల్గొన్న భక్తులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌అనంతపురంలో సోమవారం అంకాళమ్మ పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్థులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గోపూజ, హోమాలను చేశాక విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. అనంతరం మహాపూర్ణాహుతి చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత


మూతబడిన ఆర్‌ఐ, డీటీ గది

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరతతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్‌డీటీ, ఆర్ఐ, ఇద్దరు వీర్వోలు లేక పనులు కుంటుపడుతున్నాయి. ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో తహసీల్దార్ శ్రీదేవి అదనపు విధులను నిర్వర్తించాల్సి వస్తోంది. దీంతో కొంత ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి సిబ్బంది కొరత లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సోమనాథేశ్వరుడికి రుద్రాభిషేకం



పిచ్చాటూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సిద్ధిరాజు కండ్రిగలో గౌరీ సమేత సోమనాథేశ్వర ఆలయంలో సోమవారం మహారుద్రాభిషేకం జరిగింది. తమిళనాడు నుంచి కూడా భక్తులు వచ్చారు. ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు జీర్ణోద్ధారణ కమిటీ సభ్యులతో దర్శన ఏర్పాట్లను చేశారు. అభిషేకాల అనంతరం స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



శ్రీకాళహస్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిత్యాన్నదాన పథకానికి సోమవారం హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీ ప్రసూన పాసం దంపతులు తమ కుమార్తె నిత్య తన్వి పేరుమీద రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈవో బాపిరెడ్డి విరాళాన్ని స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు బీఎన్‌కండ్రిగ మండల మీట్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్యతిథిగా హాజరు అవుతారన్నారు. అధికారులు మూడు నెలలకు సంబంధించిన నివేదికలతో హాజరు కావాలని ఆమె కోరారు.

బాలికల గురుకులంలో బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగుల సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో టెన్త్‌లో 2, ఇంటర్ ఎంపీసీలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. ముందుగా వచ్చిన వారికే సీట్లు కేటాయిస్తామన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ: కేసుల నమోదు

వరదయ్యపాళెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): షామియానా బాడుగ విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం దాడులకు దారి తీసింది. ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు పాదిరికుప్పంకు చెందిన ధనుంజయ శెట్టి ఇంట్లో పొంగళ్ళ వేడుకకు వానెల్లూరుకు చెందిన తిరుమల సప్లయర్ షామియానా సమకూర్చారు. వేడుకల అనంతరం ఆదివారం రాత్రి తొలగించేందుకు షామియానా సిబ్బంది, సజిన్, దిలీప్‌లు వచ్చారు. వారిని బంధువులు అడ్డుకుని ఉదయం తొలగించాలన్నారు. అలాగైతే మరోరోజు అద్దె చెల్లించాల్సి వస్తుందనడంతో సిబ్బందితో గొడవ పడ్డారు. మాటామాటా పెరగడంతో చంద్రశేఖర్, అతని బంధువులు మూకుమ్మడిగా సిబ్బందిపై దాడి చేశారు. సజిన్‌పై కర్రలు, బీరుసీసాలతో కొట్టి గాయపరిచారు. దీంతో షామియానా యజమాని తిరుమల కొందరిని తీసుకువెళ్లి వేడుకల నుంచి వస్తున్న వారిపై ప్రతీకార దాడి చేశారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తిరుపతికి చెందిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

శ్రీకాళహస్తి, ఆగస్టు, 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు యాంత్రీకరణతో పాటు ఆధునిక వ్యవసాయ విధానాలపై మరింత అవగాహన పెంచాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త దామోదర్ రెడ్డి వ్యవసాయశాఖ సంచాలకులు రమేష్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవసరమైన ఆధునిక యంత్రాలను పంపిణీ చేయాలని కోరారు. అవగాహన సదస్సుల ద్వారా రైతులను చైతన్యపరచాలని విజ్ఞప్తి చేశారు. మండల పార్టీ అధ్యక్షులు సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఎస్వీయూలో భద్రతా శిక్షణ కేంద్రం


ఒప్పంద పత్రాలతో వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖతో ఎస్వీయూ అవగాహన ఒప్పందం చేసుకుంది. కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కమిషనర్ శేషగిరిబాబుతో ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సోమవారం విజయవాడలో సమావేశమై అవగాహన ఒప్పందంపై చర్చించి, సంతకాలు చేశారు. ఎస్వీయూలో భద్రతా శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. పరిశ్రమల్లోని భద్రతా సిబ్బందికి నైపుణ్య శిక్షణ ఈ కేంద్రం ద్వారా అందించనున్నారు. కంపెనీ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌పై యూనివర్సిటీలో ఒక కోర్సును కూడా నిర్వహించాలని భావిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక, సాంకేతిక సహకారం ప్రభుత్వం అందించనుంది. ఎస్వీయూ సీడీసీ డీన్ చెంగ్రాయుడు పాల్గొన్నారు.

ఈ మార్గంలో ప్రయాణం నరకం

● గుంతలమయం సూళ్లూరుపేట రోడ్డు


మతకముడి దగ్గర గుంతలు


ఉగ్గుమూడి దగ్గర గుంతల్లో వర్షపు నీరు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సూళ్ళూరుపేట, బుచ్చినాయుడుకండ్రిగ రహదారి వర్షాలకు అధ్వానంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వంలో రెండు వరుసల రహదారి మంజూరయింది. సూళ్ళూరుపేట నుంచి పెరిటిపాడు వరకు మాత్రమే ఈ రెండు వరుసల రోడ్డు నిర్మించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో అక్కడ నుంచి బీఎన్‌కండ్రిగ వరకు పది కిలోమీటర్ల మేర పనులు నిలిపివేశారు. బీఎన్‌కండ్రిగ, శ్రీకాళహస్తి మండలాల నుంచి సూళ్లూరుపేటలోని అపాచి పరిశ్రమకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈమార్గంలో ఇబ్బందుల గురించి డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. మట్టి పోసి గంతులకు ప్యాచులు చేయడం వంటి పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నారు. తాజా వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. తంగెళ్లపాళెం, ఆలత్తూరు క్రషల నుంచి నిత్యం టిప్పర్ల ఒత్తిడితో రోడ్డు దారుణంగా మారింది.

బ్యానర్ల వివాదం : ట్రాఫిక్‌కు అంతరాయం

● రాత్రివేళ టీడీపీ నాయకుల నిరసన


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌పురంలో బ్యానర్ల వివాదంతో ఆదివారం రాత్రి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆదివారం మధ్యాహ్నం టీడీపీ నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనకు స్వాగతం పలుకుతూ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున బ్యానర్లు శ్రీకాళహస్తి-తడ రోడ్డు, వీఎస్‌పురం జంక్షన్లలో ఏర్పాటు చేశారు. కార్యక్రమం ముగిశాక అరుంధతీయవాడకు చెందిన ఒకరు ఇంటి పైకప్పు పైన వేసుకోవడానికి ఒక బ్యానరు కావాలని అడిగారు. ఇందుకు టీడీపీ నాయకుడొకరు సరే నన్నారు. ఇది చూసి మరికొందరు మిగిలిన బ్యానర్లు తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కోపోద్రిక్తుడయ్యారు. రాత్రి 9గంటల సమయంలో అనుచర గణంతో శ్రీకాళహస్తి-తడ రహదారిపై కారును అడ్డంగా పెట్టారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌లో 108 అంబులెన్స్ కూడా ఇరుక్కుంది. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథ నాయుడు, ఎస్ఐ సుధీర్‌రెడ్డిలు చేరుకుని సర్ది చెప్పినా నాయకులు ససేమిరా అన్నారు. గంట తరువాత ప్రయాణికులు తిరగబడే సందర్భంలోనాయకులు వెళ్లిపోయారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

మొబైల్ ఫోన్లను తిరిగిచ్చేసిన అంగన్వాడీలు


మొబైల్ ఫోన్లను సీడీపీవో కార్యాలయంలో అందజేస్తున్న అంగన్వాడీలు

సత్యవేడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సేవల్లో ఆన్‌లైన్ నమోదుకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్‌లను సోమవారం సీడీపీవో కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో తిరిగి ఇచ్చేశారు. వీటి నిర్వహణలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడు కండ్రిగ మండలాల కార్యకర్తలు ఫోన్లను సీడీపీవో దేవకుమారికి తిరిగిచ్చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు నిర్మల, శాంతి మాట్లాడుతూ లబ్ధిదారులకు ఫోటో క్యాప్చర్, ఓటీపీ, ఎఫ్ఆర్ఎస్ ద్వారానే సరుకులు ఇవ్వాలని పెట్టిన నిబంధన అమలు చేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకులు అన్నీ ఒక్కసారే అందకపోవడం, సర్వర్లు పనిచేయకపోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒకే యాప్‌గా మార్పు చేయాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఇన్, అవుట్ ఆప్షన్లు రద్దు చేయాలని, ట్యాబ్‌లుఅందించాలని కోరారు. **పిచ్చాటూరు:** స్థానిక సీడీపీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వమిచ్చిన ఫోన్లను అధికారులకు అందించారు. **రేణిగుంట:** మండలంలో అంగన్వాడి వర్కర్లు సెల్‌ఫోన్లను వెనక్కిచ్చారు. వీరు కార్యాలయంలో 135 సెల్ ఫోన్లను అధికారులకు అందజేశారు.

జీవో నెంబర్ 26 అమలుకు వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర న్యాయ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, సంఘం సభ్యులు

రేణిగుంట ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జీవో నెంబర్ 26 అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివ విజ్ఞప్తి చేశారు. గురువారం మధ్యాహ్నం తిరుపతి పర్యటన ముగించుకుని విజయవాడ వెళుతున్న మంత్రిని విమానాశ్రయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల సంక్షేమం అభివృద్ధి కోసం 1996లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 26ను విడుదల చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో బార్బర్ పోస్టులు భర్తీ చేస్తే నాయి బ్రాహ్మణకు మేలు జరుగుతుందన్నారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.


యోగా పోటీల్లో సుజాత ప్రతిభ

శ్రీకాళహస్తి, ఆగస్టు, 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన యోగా మాస్టర్ సుజాత ప్రతిభ చాటారు. ఆదివారం యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో ఉమ్మడి జిల్లాస్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. శ్రీకాళహస్తికి చెందిన శివ సాయి యోగా శంకర్ మాస్టర్ సుజాత రెండు బంగారు పతకాలను గెలుచుకున్నారు. ఆమె వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థిని యక్షమైత్రి ఒక బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. యోగా మాస్టర్ సుజాతను పలువురు అభినందించారు.

వంటనూనెల దుకాణాలపై దాడులు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు సోమవారం తిరుపతిలోని వంటనూనెల హోల్‌సేల్ దుకాణాలపై దాడులు చేశారు. జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి జగదీష్ సిబ్బందితో కలిసి ఇందిరా ప్రియదర్శిని వెజిటబుల్ మార్కెట్, బైరాగిపట్టెడ తదితర ప్రాంతాల్లోని వివిధ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఆయిల్స్ శ్యాంపిల్స్ సేకరించారు. బైరాగిపట్టెడలోని వివిధ బేకరీలు, స్వీట్ షాపుల్లో వాడుతున్న నూనెలను తనిఖీ చేశారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం హర్షణీయం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు- హర్షం వ్యక్తం చేస్తున్న చేనేత కార్మిక నాయకులు

శ్రీకాళహస్తి, ఆగస్టు, 4 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడం హర్షణీయమని లబ్ధిదారులు తెలిపారు. పట్టణంలోని పద్మశాలిపేటలో సోమవారం చేనేత కార్మికులు కూటమినేతల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చేనేత రంగానికి జీవం పోయడమే ధ్యేయంగా ఇచ్చిన ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు నాయుడు అమలు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఇవ్వడం చారిత్రక నిర్ణయం అన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి చిత్రపటాలకు చేనేత కార్మికులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పద్మ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ నిర్ణయంపై నాగలాపురం దేవాంగ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు పృథ్వీ నాగరాజు ఆనందం వ్యక్తం చేశారు. చేనేత సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పృథ్వీనాగరాజు మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో భాగంగా చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ అమలు చేయడం హర్షణీయమన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం: సీడీపీవో

వరదయ్యపాళెం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతోందని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో దేవకుమారి తెలిపారు. కంచరపాళెం అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రతి తల్లి తమ పిల్లలకు ముర్రుపాలను తప్పకుండా తాగించాలని కోరారు. బిడ్డ శరీర ఎదుగుదలకు బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి



ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు

సత్యవేడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లి తండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదన్న ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. సత్యవేడులో సోమవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద పలు కళాశాలల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి మురళి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, హక్కులను హరించేలా ఉందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వైభవంగా వీరభద్రుని రథోత్సవం



నారాయణవనం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): టీడీడీ అనుబంధ ఆలయమైన భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మధ్యాహ్నం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం భద్రకాళి, వీరభద్రస్వామిలకు స్నపన తిరుమంజనం చేశారు. మధ్యాహ్నం స్వామి రథోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME
I, KUMAR SWAMY GURIJALA (Old Name) S/o RAMAKRISHNAIAH NAIDU GURIJALA, R/at D.No. 2-505, Sai Sannidhi Colony, Near ION Digital Zone, Cherlopalli, Pudipatla, Tirupati Rural (M)-517505, Tirupati Dist, AP. I have changed my name to KUMARA SWAMY GURIJALA (New Name). Henceforth, I will be known as KUMARA SWAMY GURIJALA.
AJT -1506

CHANGE OF NAME
I, Cilaguntpalli Dhanalakshmi W/o C.Siva, R/at D.No 4-134 Rickshaw Colony, Near S.V.Zoo Park, Cherlopalli, Tirupati Rural Mandal and District, AP. have changed my son name from C.STEEPHAN to C.CHARAN TEJA.
AJT -1505

WANTED
తిరుపతిలో ప్రముఖ కంపెనీ నందు బట్టలు ఐరన్ చేయుటకు అనుభవం కలిగిన వ్యక్తులు కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 99631 86385, 93812 15592
AJT -239891

VOCATIONAL COURSES
తిరుపతిలో Dr.VBR ఒకేషనల్ జూనియర్ కళాశాల లో 10th పాస్ అయిన వాళ్ళకి ఒకేషనల్ కోర్సులు ANM/MPHW-F (నర్సింగ్)/ MLT/ వెటర్నరీ/డైరీ సైన్స్/ అగ్రికల్చర్ సీట్లు Inter BiPCతో కలవు. & ఇంటర్ పాస్ అయిన వాళ్ళకి BSc(నర్సింగ్), BPT, BSc MLT, GNM, డిప్లొమా పారామెడికల్ కోర్సులు కూడా కలవు. సంప్ర: 81250 40004
AJT -1508

WANTED
తిరుపతిలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు 5-10 సం॥ అనుభవం గల ఆఫీసు ఎగ్జిక్యూటివ్ (వివాహిత) డిగ్రీ కంప్యూటర్ పరిజ్ఞానం కావలెను. సంప్ర: 96760 22100.
AJT -1502

తుడా అప్రూవల్ ప్లాట్స్
IT హబ్, IIT,IISER ఏర్పేడు ఇండస్ట్రియల్ ఏరియాలో బ్యాంకులోన్ ఇన్‌స్టాల్‌మెంట్స్ అతితక్కువ ధరలకే స్పాట్ రిజిస్ట్రేషన్. శ్రీసాయి చైతన్య డెవలపర్స్ మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్ర: 91105 49394
AJT -239892

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA- 237937

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, దట్టి వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి